పేరుకుపోయిన పూడిక


గొట్టాబ్యారేజీ వద్ద పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 6 టీఎంసీలు. గత ఆరేళ్లుగా వచ్చిన వరదలకు ఎగువ ప్రాంతంలో మట్టి నిల్వలు, పూడికలు పేరుకుపోయాయి. దీంతో బ్యారేజీ వద్ద నీటి నిల్వ సామర్థ్యం తగ్గుతూ వస్తోంది. ఇన్‌ఫ్లో తక్కువగా ఉన్నప్పుడు కుడి, ఎడమ ప్రధాన కాలువలకు నీటిని విడిచిపెట్టలేని పరిస్థితి ఏర్పడింది. టీడీపీ ప్రభుత్వ హయాంలో 2018లో బ్యారేజీ ఎగువ ప్రాంతంలో యంత్రాలతో పూడికలు తొలగించారు. వైసీపీ హయాంలో మట్టి దిబ్బలు తొలగించకపోవడంతో నీటి నిల్వ సామర్థ్యం తగ్గింది.

కొట్టుకుపోయిన ఫ్లడ్ బ్యాంక్

గొట్టాబ్యారేజీ కుడివైపు ఉన్న ఫ్లడ్ బ్యాంక్ మూడేళ్ల కిందట వచ్చిన వరదలకు కోతకు గురైంది. ప్రాథమిక దశలో మరమ్మతులు చేయకపోవడంతో అప్పటి నుంచి ఏటా వచ్చిన వరదలకు పూర్తిగా కొట్టుకుపోయింది. కనీసం దీని పునర్నిర్మాణానికి కూడా వైసీపీ ప్రభుత్వం పైసా నిధులు మంజూరు చేయలేదు. ఈ నేపథ్యంలో ప్రస్తుత ఎన్డీయే కూటమి ప్రభుత్వంపైనే రైతులు ఆశలు పెట్టుకున్నారు. కాగా.. ఈ ఏడాది ఇప్పటికే వర్షాకాలం ప్రారంభం కావడంతో పనులు చేసే పరిస్థితి లేదు. బ్యారేజీ మరమ్మతులు చేపట్టాలంటే వచ్చే ఏడాది జనవరి వరకు ఆగాల్సి ఉంది. కాగా.. ఈ ఏడాది భారీ వరదలు వస్తే.. బ్యారేజీ దిగువ ప్రాంతంలో మరికొంత శిథిలమయ్యే అవకాశం ఉంది.

వేధిస్తున్న సిబ్బంది కొరత..

గొట్టాబ్యారేజీ నిర్వహణకు ఉద్యోగులు, సిబ్బంది కొరత వేధిస్తోంది. ఖరీఫ్ సీజన్‌లోను, వరదల సమయంలో బ్యారేజీ నిర్వహణకు గతంలో 22మంది ఉద్యోగులు విధులు నిర్వహించేవారు. వర్క్ ఇన్‌స్పెక్టర్, హెల్పర్, మేన్‌మజుదూర్, ఆపరేటర్, ఎలక్ట్రీషియన్, లష్కర్లు ఇలా పలువురు సిబ్బంది ఉండేవారు. దశాబ్దాల కిందట నియమించినవారిలో చాలామంది పదవీ విరమణ పొందారు. వారి స్థానంలో కొత్తగా నియామకాలు చేపట్టలేదు. ప్రస్తుతం ముగ్గురు మాత్రమే ఉన్నారు. వీరితోనే బ్యారేజీ, కుడి, ఎడమ ప్రధాన కాలువల నిర్వహణ కష్టమవుతోంది. విద్యుత్ సరఫరా వ్యవస్థ, సీడబ్ల్యూసీ నుంచి వివరాలు సేకరణ ఇలా ఏ పని చేయాలన్నా ఈ ముగ్గురిపైనే ఆధారపడాల్సి వస్తోంది. షిఫ్ట్ పద్ధతి ఉన్నా.. తగినంత సిబ్బంది లేక వీరే వరదల సమయంలో రాత్రీపగలూ విధులు నిర్వర్తిస్తున్నారు. కాలువలకు గండ్లు పడినా వారే స్వయంగా పూడ్చాల్సిన పరిస్థితి నెలకొంది.


గొట్టాబ్యారేజ్ దిగువన శిథిలావస్థకు చేరిన రాతికట్ట నిర్మాణం

నిధులు.. ఎగ్గొట్టారు!

- శిథిలావస్థలో గొట్టా బ్యారేజీ
- మరమ్మతులకు పైసా ఇవ్వని వైసీపీ ప్రభుత్వం
- ఏళ్ల తరబడి కానరాని నియామకాలు
- సాగునీటికి తప్పని ఇబ్బందులు
- కూటమి సర్కార్‌పైనే రైతుల ఆశలు

(హిరమండలం)

హిరమండలం వద్ద వంశధార నదిపై ఉన్న గొట్టాబ్యారేజీ శిథిలావస్థకు చేరుకుంది. జిల్లా రైతులకు సాగునీటితో పాటు ఎన్నో గ్రామాలకు తాగునీటి అవసరాలు తీర్చే ఈ బ్యారేజీ.. వైసీపీ పాలనలో తీవ్ర నిర్లక్ష్యానికి గురైంది. దీనికి అనుసంధానంగా సుమారు రూ.1,750కోట్లతో వంశధార రిజర్వాయర్ నిర్మిస్తున్నా.. గత ప్రభుత్వం గొట్టాబ్యారేజీ బాగోగులు పట్టించుకోలేదు. ఐదేళ్లుగా నిధులు మంజూరు చేయలేదు. కనీసస్థాయిలో మరమ్మతులు చేపట్టకపోవడంతో అధ్వానంగా మారింది. ఏటా వరదల కారణంగా.. బ్యారేజీ దిగువన జడ్డిస్టోన్ ఏప్రాన్ పూర్తిగా దెబ్బతింది. రాళ్లు తేలి బ్యారేజీ ప్రమాదపుటంచున నిలిచింది. ఇంజినీరింగ్ నిపుణుల సూచన మేరకు జడ్డిస్టోన్ ఏప్రాన్‌స్థానంలో కాంక్రీట్ ఏప్రాన్ నిర్మించేందుకు 2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో రూ.8.5కోట్లు మంజూరయ్యాయి. కాంట్రాక్టర్ 10శాతం పనులు చేపట్టారు. ఇంతలో సార్వత్రిక ఎన్నికలు రాగా.. పనులు నిలిచిపోయాయి. తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ.. అంతకుముందు ప్రభుత్వం(టీడీపీ) చేపట్టిన పనుల్లో 25 శాతం లోపల ఉన్నవాటిని రద్దు చేసింది. దీంతో అప్పటి నుంచీ గొట్టాబ్యారేజీ పరిస్థితి దయనీయంగా మారింది. దిగువన ఉన్న సీసీ ఏప్రాన్‌ను కూడా తక్షణమే నిర్మించకపోతే.. వరదల సమయంలో బ్యారేజీకి ముప్పు తప్పదని ఇంజినీరింగ్ అధికారులు స్పష్టం చేస్తున్నారు.

● పట్టని గేట్లు మరమ్మతులు

గొట్టాబ్యారేజీ 24 గేట్లతోపాటు.. అనుసంధానంగా ఉన్న కుడి, ఎడమ కాలువల హెడ్ రెగ్యులేటర్ గేట్లకు ఐదేళ్లుగా కనీస మరమ్మతులు లేక పాడైపోయాయి. బ్యారేజీ ఎగువ ప్రాంతంలో నీరు నిల్వ చేసేందుకు గేట్లు దించినా.. లీకేజీ ద్వారా వథాగా పోతోంది. 2018లో గేట్లకు మరమ్మతులు చేపట్టారు. అప్పటి నుంచీ బ్యారేజీ నిర్వహణకు పూర్తిస్థాయిలో నిధులు కేటాయించలేదు. గేట్లకు సంబంధించి బేరింగ్‌లు, రోలర్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. వీటిని మార్చాల్సి ఉన్నా వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. బ్యారేజీ మరమ్మతులకు వంశధార అధికారులు అప్పట్లో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినా నిధులు మంజూరు చేయలేదు.

● కొత్తగా డిజైన్ రూపొందిస్తున్నాం..

గొట్టాబ్యారేజీ మరమ్మతులకు సీఈసీడీఓ సూచనల మేరకు కొత్తగా డిజైన్ రూపొందిస్తున్నాం. ఆ డిజైన్‌ను ప్రభుత్వానికి పంపిస్తాం. జడ్డిస్టోన్ ఏప్రాన్, చెదిరిన సీసీ బ్లాకు నిర్మాణం వంటి మరమ్మతులకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నాం. వచ్చే ఏడాది ఎస్ఎస్ఆర్ రేట్లు కూడా మారుతాయి. అప్పటి రేట్ల ప్రకారం నివేదిక తయారు చేస్తాం.

-బి.రాంబాబు, ఎస్ఈ, వంశధార ప్రాజెక్టు

రెండేళ్లలో ఎయిర్‌పోర్టు

- సకాలంలో పనులు పూర్తిచేస్తాం
- ఆ బాధ్యత కేంద్రమంత్రి రామ్మోహన్‌దే
- ఉత్తరాంధ్ర అభివృద్ధే లక్ష్యం: సీఎం చంద్రబాబు


ఎయిర్‌పోర్టు పనులు పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబు, కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు తదితరులు

విజయనగరం, జూలై 11(ఆంధ్రజ్యోతి): భోగాపురం గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు పనులు రెండేళ్లలో పూర్తి చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రకటించారు. కూటమికి చారిత్రక విజయం అందించిన ఉత్తరాంధ్ర ప్రజల రుణం తీర్చుకుంటామన్నారు. గురువారం విజయనగరం జిల్లా భోగాపురం వచ్చిన సీఎం చంద్రబాబుకు కేంద్ర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, కేంద్ర మాజీమంత్రి అశోక్‌గజపతిరాజు, రాష్ట్ర మంత్రులు కొండపల్లి శ్రీనివాస్, గుమ్మిడి సంధ్యారాణి తదితరులు ఘన స్వాగతం పలికారు. తొలుత ఎయిర్‌పోర్టు నిర్మాణ పనులు, ఫొటో గ్యాలరీ, నమూనాను సీఎం పరిశీలించారు. అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం విలేకరులతో చంద్రబాబు మాట్లాడారు. '2015లో ఎయిర్‌పోర్టు నిర్మాణానికి ప్రణాళిక సిద్ధం చేశాం. 2016 అక్టోబరులో కేంద్ర ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది. అనంతరం రైతుల నుంచి 2,700 ఎకరాలు సేకరించాం. అన్నీ సజావుగా జరిగితే, 2023 నాటికే ఎయిర్‌పోర్టు వినియోగంలోకి రావాల్సి ఉంది. 2019లో బాధ్యతలు చేపట్టిన జగన్మోహన్‌రెడ్డి పిల్లచేష్టలు, పిచ్చి చేష్టలతో ఎయిర్‌పోర్టు నిర్మాణ పనులు ముందుకు సాగలేదు. ప్రస్తుతం పనులు వేగవంతానికి చర్యలు చేపడుతున్నాం. 2026 జూన్ 30కు ముందే ఎయిర్‌పోర్టును పూర్తి చేయాలని అధికారులు, జీఎంఆర్ కనస్ట్రక్షన్ వారికి ఆదేశించాం. ఎయిర్‌పోర్టు వినియోగంలోకి వస్తే ఉత్తరాంధ్ర ఎకనమిక్ హబ్‌గా తయారు కానుంది. ఉత్తరాంధ్రలో యువతకు ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి' అని సీఎం చంద్రబాబు వెల్లడించారు.

● 'ఉత్తరాంధ్ర వాసి జీఎంఆర్ ఈ ఎయిర్‌పోర్టు నిర్మాణం చేపట్టారు. గతంలో ఉత్తరాంధ్రకు చెందినవారైన కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రిగా పనిచేసిన అశోక్ గజపతిరాజు ఈ ఎయిర్‌పోర్టు నిర్మాణాన్ని ఎంతో బాధ్యతగా తీసుకున్నారు. ఇప్పుడు అదే శాఖకు కేంద్ర మంత్రిగా రామ్మోహన్‌నాయుడు ఉండడం విశేషం. కేంద్రపౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు ఈ ఎయిర్‌పోర్టు నిర్మాణాన్ని శరవేగంగా పూర్తిచేసేందుకు ఎప్పటికప్పుడు సమీక్షిస్తారు. ఎయిర్‌పోర్టుకు వెళ్లే రహదారుల విస్తరణ తదితర అంశాలపైనా ప్రత్యేక దృష్టి సారించాం. జాతీయ రహదారికి ఆరు కిలోమీటర్ల దూరంలో ఎయిర్‌పోర్టు ఉంది. 12 చోట్ల మార్పులు, చేర్పులు చేసి జంక్షన్‌లను అభివృద్ధి చేయాల్సి ఉంది. తాగునీరు, విద్యుత్ తదితర సౌకర్యాల విషయమై ఎప్పటికప్పుడు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో చర్చించి, త్వరత్వరగా నిర్ణయాలు తీసుకుని పూర్తి చేస్తాం. ఎయిర్‌పోర్టు నిర్మాణం పూర్తయితే రాయఘడ్, కోరాపుట్, మల్కాన్‌గిరి, తూర్పుగోదావరి, శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి తదితర ప్రాంతాలకు కనెక్టవిటీ విస్తృతంగా ఉంటుంది' అని సీఎం చంద్రబాబు తెలిపారు.

ట్రిపుల్ ఐటీల్లో ప్రవేశాలు

- 'ఆర్జీయూకేటీ' మెరిట్ జాబితా విడుదల
- శ్రీకాకుళం క్యాంపస్‌కు 1,010 మంది ఎంపిక
- 26, 27 తేదీల్లో సర్టిఫికెట్ల పరిశీలన

ఎచ్చెర్ల, జూలై 11: ట్రిపుల్ ఐటీల్లో ప్రవేశాలకు మెరిట్ జాబితా విడుదలైంది. రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్(ఆర్జీయూకేటీ) పరిధిలోని శ్రీకాకుళం, నూజివీడు, ఒంగోలు, ఆర్కే వ్యాలీ (ఇడుపులపాయి)లోని ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లు ఉన్నాయి. వీటిలో ఈ ఏడాది ఇంటిగ్రేటెడ్ ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశానికి ఎంపికైన మెరిట్ జాబితాను.. గురువారం నూజివీడు క్యాంపస్‌లో ఆర్జీయూకేటీ చాన్స్‌లర్ ప్రొఫెసర్ కేసీ రెడ్డి విడుదల చేశారు. ఇప్పటికే ప్రత్యేక కేటగిరీలకు చెందిన విద్యార్థుల సర్టిఫికెట్ల పరిశీలన పూర్తయింది. జనరల్ కేటగిరీలో సీట్లు పొందిన విద్యార్థుల జాబితాను అధికారులు వెల్లడించారు. శ్రీకాకుళం ట్రిపుల్ క్యాంపస్‌లో బాలురు 325 మంది, బాలికలు 685 మందిని మెరిట్ ప్రాతిపదికన మొత్తం 1,010 మందిని ఎంపిక చేశారు. వీరికి ఈ నెల 26,27 తేదీల్లో సర్టిఫికెట్లు పరిశీలిస్తారు. ఎంపికైన విద్యార్థుల్లో ప్రభుత్వ పాఠశాలల నుంచి 915 మంది, ప్రైవేటు పాఠశాలల నుంచి 95 విద్యార్థులు ఉన్నారు. అలాగే ఇక్కడి క్యాంపస్‌కు ఆంధ్రప్రదేశ్ నుంచి 998 మంది, తెలంగాణ నుంచి 12 మంది, ఇతర రాష్ట్రాల నుంచి ఒక్కరు సీటు పొందారు. ఇక్కడి క్యాంపస్‌లో సీటు పొందిన వారిలో ఓసీ 91 మంది, బీసీ-ఏ 132 మంది, బీసీ-బీ 168 మంది, బీసీ-సీ 10 మంది, బీసీ-డీ 273 మంది, బీసీ-ఇ 40 మంది, ఎస్సీ-140 మంది, ఎస్టీ-56 మంది, ఈడబ్ల్యూఎస్ 100 మంది ఉన్నారు. జిల్లా నుంచి నూజివీడు క్యాంపస్‌కు 160 మంది, ఆర్కే వ్యాలీ క్యాంపస్ ఒకరు, ఒంగోలు క్యాంపస్‌కు 112, శ్రీకాకుళం క్యాంపస్‌కు 225 మందికి కేటాయించారు. మొత్తం 498 మంది నాలుగు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లకు ఎంపికయ్యారు. శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌కు ఎంపికైన విద్యార్థులు.. నిర్దేశించిన తేదీల్లో అన్ని ఒరిజనల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని క్యాంపస్ డైరెక్టర్ ప్రొఫెసర్ కేవీజీడీ బాలాజీ, ఏవో ముని రామకృష్ణ, అకడమిక్ డీన్ కె.మోహనకృష్ణ చౌదరి సూచించారు. ప్రవేశం పొందిన విద్యార్థులకు ఆగస్టు మొదటి వారంలో తరగతులు ప్రారంభమవుతాయని తెలిపారు.



శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీ క్యాంపస్

ఇసుక కోసం పాట్లు

- పలాసలో విక్రయ కేంద్రం లేక ఇబ్బందులు
- ఒడిశా నుంచి అధిక ధరకు దిగుమతి

పలాస, జూలై 11: ఇసుక విక్రయ కేంద్రం లేక పలాస నియోజకవర్గ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పలాస-కాశీబుగ్గ జంట పట్టణాలకు ప్రతిరోజు ఐదువేల మెట్రిక్ టన్నుల ఇసుక అవసరం. నరసన్నపేట, జలుమూరు, కాశీనగర్(ఒడిశా), రుషుకుల్య (ఛత్రపూర్) ప్రాంతాల నుంచి నిత్యం లారీలపై ఇసుకను ఇక్కడకు తీసుకువచ్చి విక్రయిస్తుంటారు. ఈ పరిస్థితిని గుర్తించిన గత ప్రభుత్వం పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీ కోసంగిపురం జంక్షన్ వద్ద ఇసుక విక్రయ కేంద్రాన్ని ప్రారంభించింది. అక్కడ నుంచే నేరుగా భవన నిర్మాణదారులకు ఇసుక విక్రయించేది. దీంతోపాటు ఇతర ప్రాంతాల నుంచి నిల్వలు భారీగా చేరుకోవడంతో ఇసుక కష్టాలు ఉండేవి కావు. ప్రస్తుతం ఎన్డీయే కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఉచిత ఇసుక విధానాన్ని ప్రవేశపెట్టింది. రాష్ట్ర ప్రభుత్వం టెక్కలి, కొత్తూరు మండలం అంగూరు ప్రాంతాల్లో మాత్రమే ఇసుక విక్రయ కేంద్రాలు ప్రారంభించింది. నిత్యం వేల టన్నుల అవసరం ఉన్న పలాసను విస్మరించింది. దీంతో ఇక్కడ భవన నిర్మాణదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. టెక్కలిలో ఇసుక ర్యాంపు ప్రారంభించినా తమకు కనీసం టన్ను అయినా లభించదని పేర్కొంటున్నారు. వాస్తవానికి టెక్కలి కన్నా నరసన్నపేట వద్ద నేరుగా నది నుంచి ఇసుక తీసుకురావడమే సులభమని రవాణాదారులు చెబుతున్నారు.

● జంట పట్టణాల్లో ఇసుక కొరత కారణంగా రూ.కోట్లు విలువైన భవన నిర్మాణాలు ఆగిపోయాయి. ప్రస్తుత విధానం వల్ల అదనపు ఇబ్బందులు ఏర్పడ్డాయని నిర్మాణదారులు వాపోతున్నారు. రోజుకు 20టన్నుల ఇసుక మాత్రమే ఒకరికి ఇస్తామని చెబుతుండడంతో ఆందోళన చెందుతున్నారు. నిత్యం వేల టన్నుల ఇసుక కావాల్సిన ప్రాంతంలో ర్యాంపులు నిర్వహించకుండా.. పొరుగు నియోజకవర్గం టెక్కలిలో దీన్ని పెట్టడం వల్ల ఎటువంటి ప్రయోజనం లేదని పేర్కొంటున్నారు. ఇసుక కొరత కారణంగా ఒడిశా నుంచి అధిక ధరకు కొనుగోలు చేసి తీసుకొస్తున్నామని వాపోతున్నారు. ప్రభుత్వం ఉచితంగా ఇస్తున్నా తమకు ఎందుకూ వినియోగపడడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● ఇచ్ఛాపురం నియోజకవర్గానికి బాహుదా, సోంపేట ప్రాంతానికి మహేంద్రతనయ నదుల నుంచి ఇసుక కొరత తీర్చుకోవడానికి అవకాశం ఉంది. పలాసకు ఎటువంటి ఇసుక లభ్యత లేకపోవడంతో ప్రభుత్వం సరఫరా చేసే ఇసుకపైనే ప్రజలు ఆశలు పెట్టుకున్నారు. కోసంగిపురం వద్ద ఉన్న ర్యాంపులో నిల్వలు పెట్టుకునేందుకు వీలుగా భారీ స్థలాలు ఉండడంతో అధికారులు, ప్రజాప్రతినిధులు ఇక్కడ ర్యాంపు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

కలెక్టర్‌తో మాట్లాడాను

పలాస నియోజకవర్గానికి ఇసుక నిల్వ కేంద్రం ఇప్పటికే ఉంది. ముందుగా టెక్కలి, పాతపట్నం ప్రాంతాల్లో ఇసుక విక్రయ కేంద్రాలు ప్రారంభించారు. పలాసలో కూడా ప్రారంభించాలని ఇప్పటికే కలెక్టర్‌ను కోరాను. తొందరలోనే సమస్య పరిష్కారం అవుతుంది. నిర్మాణదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

- గౌతు శిరీష, ఎమ్మెల్యే, పలాస


కోసంగిపురం వద్ద ఖాళీగా ఉన్న ఇసుక విక్రయ కేంద్రం

నారాయణా.. నీరందేనా?

- పూర్తికాని నారాయణపురం ఆధునికీకరణ
- ఎమ్మెల్యే చొరవతో కాలువలో పూడికతీత
- 18న సాగునీటి విడుదలకు సన్నాహాలు

(ఎచ్చెర్ల)

ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది. అన్నదాతల గుండెల్లో ఆందోళన మొదలైంది. నారాయణపురం కుడి కాలువ కింద ఉన్న ఆయకట్టు రైతులు.. ఈ ఏడాదైనా ఖరీఫ్‌లో సాగునీరు అందుతుందో లేదోనని ఆందోళన చెందుతున్నారు. ఓ వైపు వర్షాభావ పరిస్థితులు, మరోవైపు కాలువ ద్వారా సాగునీరు అందక ఏటా ఇబ్బందులు పడుతున్నామని శివారు ప్రాంత రైతులు వాపోతున్నారు. కాగా.. ఇటీవల స్థానిక ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు చొరవతో నవభారత్ జంక్షన్ నుంచి కుడి కాలువలో పూడిక తీత పనులు ప్రారంభమయ్యాయి. ఈ ఏడాది శివారు గ్రామాలకూ సాగునీరు సరఫరా అయ్యేలా చర్యలు చేపట్టాలని అధికారులకు ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ మేరకు ఈ నెల 18న సాగునీటి విడుదలకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. దీంతో రైతులు కాస్త ఊరట చెందుతున్నారు.

పాడైన షట్టర్లు..


దుప్పలవలస వద్ద షట్టర్ పరిస్థితి


నారాయణపురం ఆనకట్ట కింద కుడి, ఎడమ కాలువలు ఉన్నాయి. సంతకవిటి, పొందూరు, ఎచ్చెర్ల మండలాల పరిధిలో సుమారు 50.6 ఎకరాల పొడవునా కుడి కాలువ విస్తరించి ఉంది. కుడి కాలువ పొడవునా చిన్నా, పెద్దా షట్టర్లు సుమారు 60 ఉన్నాయి. ఈ షట్టర్లు అన్నీ పూర్తిగా పాడయ్యాయి. ఆనకట్ట ఏర్పాటు చేసిన సమయంలోనే ఈ షట్టర్స్‌ను బిగించారు. ఆ తర్వాత షట్టర్స్‌ను మార్చిన దాఖలాల్లేవు. షట్టర్స్ లేకపోవడం వల్ల సాగునీరు వృథా అవుతోంది. కుడి కాలువ కింద శివారున ఎచ్చెర్ల మండలంలోని కొత్తపేట, ముద్దాడ, పొన్నాడ, ధర్మవరం, రామజోగిపేట, భగీరథపురం తదితర గ్రామాల పరిధిలోని ఆయకట్టుకు ఏటా అతికష్టమ్మీద సాగునీరు సరఫరా చేస్తున్నారు. సీజన్ వచ్చే సమయంలోనే మొక్కుబడిగానే పనులు జరుగుతున్నాయి. దీంతో ఆయకట్టుదారులకు పెద్దగా ప్రయోజనం ఉండడంలేదు. అలాగే కొన్నేళ్లుగా కింతలి సెక్షన్ పరిధిలో లస్కర్లు లేరు. సీజన్‌ల వారీగా లస్కర్లను తాత్కాలికంగా నియమిస్తూ కాలం నెట్టుకువస్తున్నారు. గతంలో సుమారు 10 మంది లస్కర్లు శాశ్వత ప్రాతిపదికన పనిచేసేవారు. ప్రస్తుతం పూర్తిస్థాయిలో లస్కర్లు లేక.. సాగునీటి సరఫరాకు ఇబ్బందులు తప్పడం లేదు.

జైకా పనులు.. అంతంతమాత్రమే

2019లో అప్పటి టీడీపీ ప్రభుత్వ వినతి మేరకు కేంద్ర ప్రభుత్వం, జపాన్ ప్రభుత్వంతో కుదిరిన ఒప్పందంతో.. నారాయణపురం ఆధునికీకరణకు రూ.112కోట్ల జైకా నిధుల విడుదలకు అంగీకారం కుదిరింది. తర్వాత టెండర్లు కూడా ఖరారయ్యాయి. ఇంతలో ఎన్నికలు జరగ్గా.. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత పనుల్లో తీవ్ర జాప్యం ఏర్పడింది. తొలుత కోవిడ్, ఆ తర్వాత నిధుల కొరత కారణంగా ఆధునికీకరణ పనులు అంతంతమాత్రమే జరిగాయి. ఇప్పటికే మూడుసార్లు పనులు పూర్తికి చేసుకున్న అగ్రిమెంట్ (ఒప్పందం) కాలాన్ని విస్తరించాల్సి వచ్చింది.

శిథిలావస్థలో బ్రిడ్జిలు

నారాయణపురం కుడి కాలువ పొడవునా చాలా బ్రిడ్జిలు కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. వాసుదేవపట్నం, చిన్నయ్యపేట, మంతెన, గోకర్ణపల్లి, బూరాడపేట, దుప్పలవలస సమీపంలో బ్రిడ్జిలు శిథిలావస్థలో ఉన్నాయి. ఎచ్చెర్ల మండలం దుప్పలవలస అంబేడ్కర్ బాలుర గురుకుల పాఠశాలకు సమీపంలో కాలువపై ఉన్న బ్రిడ్జిని చూస్తే భయమేస్తోంది. ఈ బ్రిడ్జి మీదుగానే ఇక్కడి అర్బన్ హౌసింగ్ కాలనీవాసులు రాకపోకలు సాగిస్తుంటారు. ఎచ్చెర్ల మండలం మాల కుశాలపురం, పెయ్యలవానిపేట, పొందూరు మండలం కింతలి పరిధిలోని దోమగుండం చెరువు వద్ద పూర్తిగా పాడైన రెగ్యులేటర్స్‌ను మార్చాల్సి ఉంది. ఇప్పటికైనా ఎన్డీయే కూటమి ప్రభుత్వం స్పందించి నారాయణపురం కాలువ ఆధునికీకరణపై ప్రత్యేక దృష్టి సారించాలని రైతులు కోరుతున్నారు. సాగునీటి ఇబ్బందులు లేకుండా చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.


తోటపాలెం సమీపంలో కూలడానికి సిద్ధంగా ఉన్న బ్రిడ్జి


నారాయణపురం కుడి కాలువ దుస్థితి ఇలా..

ఏటా సాగునీటి కష్టాలే



శివారు గ్రామాల రైతులకు ఏటా సాగునీటి కష్టాలు తప్పడంలేదు. అతి కష్టమ్మీద శివారు గ్రామాలకు సాగునీరు అంతంత మాత్రంగానే చేరుతుంది. దీని వల్ల అన్నదాతలు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జైకా నిధులతో చేపట్టిన ఆధునికీకరణ పనులు ఇప్పటికీ పూర్తికాలేదు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్లో సాగునీటి సరఫరాకు అవసరమైన చర్యలు తీసుకోవాలి.

-పప్పల వెంకటరమణ, రైతు నాయకుడు, కొత్తపేట, ఎచ్చెర్ల మండలం

సాగునీటి సరఫరాకు చర్యలు

నారాయణపురం కాలువ ద్వారా ఈ నెల 18న సాగునీరు విడుదలకు సన్నాహాలు చేస్తున్నాం. వర్షాభావ పరిస్థితులు కారణంగా నాగావళి నదిలో ఆశించిన స్థాయిలో నీరు లేదు. శివారు గ్రామాల ఆయకట్టుకు సాగునీరు సరఫరాకు అవసరమైన చర్యలు తీసుకుంటాం.

-జీవీ రమణ, ఏఈ, కింతలి సెక్షన్

దిక్సూచి
DIKSUCHI

ఎన్‌జీ రంగా వర్సిటీలో బీఎస్సీ ఆనర్స్ కమ్యూనిటీ సైన్స్

గుంటూరులోని ఆచార్య ఎన్‌జీ రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ(ఏఎన్‌జీఆర్‌ఏయూ)- బీఎస్సీ ఆనర్స్ కమ్యూనిటీ సైన్స్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. అకడమిక్ మెరిట్ ఆధారంగా లాంలోని కాలేజ్ ఆఫ్ కమ్యూనిటీ సైన్స్‌లో అడ్మిషన్స్ ఇస్తారు. ఈ కాలేజీకి ఐకార్ గుర్తింపు ఉంది. మొత్తం 83 సీట్లు ఉన్నాయి. ఈడబ్ల్యూఎస్ అభ్యర్థుల కోసం 10 శాతం సూపర్ న్యూమరరీ సీట్లు నిర్దేశించారు. గ్రామీణ అభ్యర్థుల కోసం 40 శాతం సీట్లు ప్రత్యేకించారు. తెలుగు రాష్ట్రాలకు చెందిన పురుషులు, మహిళలు దరఖాస్తు చేసుకోవచ్చు. హాస్టల్ సౌకర్యం ఉంది.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి బైపీసీ/ఎంపీసీ/ఎంబైపీసీ గ్రూప్ సబ్జెక్టులతో ఇంటర్/ పన్నెండో తరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి.

- మూడేళ్ల వ్యవధి గల డిప్లొమా(హోం సైన్స్) ఉత్తీర్ణులైన అభ్యర్థుల కోసం పది శాతం సూపర్ న్యూమరరీ సీట్లు(ఎనిమిది సీట్లు) ప్రత్యేకించారు. గ్రామీణ అభ్యర్థులకు కేటాయించిన సీట్లకు అప్లయ్ చేసుకోవాలంటే ఒకటోతరగతి నుంచి ఇంటర్ స్థాయి వరకు కనీసం నాలుగేళ్లు గ్రామ పాఠశాలల్లో చదివి ఉండాలి. సంబంధిత ధ్రువపత్రాన్ని సబ్మిట్ చేయాల్సి ఉంటుంది.



- అభ్యర్థుల వయసు 2024 డిసెంబరు 31 నాటికి 17 నుంచి 22 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 25 ఏళ్లు; దివ్యాంగులకు 27 ఏళ్లు మించకూడదు.
- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.2,000; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1000
- **పోస్ట్ ద్వారా దరఖాస్తు చేరేందుకు చివరి తేదీ:** జూలై 29
- **దరఖాస్తు పంపాల్సిన చిరునామా:** రిజిస్ట్రార్, ఆచార్య ఎన్‌జీ రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్, లాం, గుంటూరు - 522034
- **వెబ్‌సైట్:** angrau.ac.in

ఇగ్నోలో ఓడీఎల్ కోర్సులు

న్యూఢిల్లీలోని ఇందిరాగాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్సిటీ(ఇగ్నో)- ఓపెన్ డిస్టెన్స్ లెర్నింగ్(ఓడీఎల్) కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. పీజీ, డిగ్రీ, డిప్లొమా, సర్టిఫికెట్ తదితర కోర్సులు ఉన్నాయి. ప్రోగ్రామ్‌లకు నిర్దేశించిన అర్హతల సమాచారాన్ని వెబ్‌సైట్‌లో చూడవచ్చు.

అడ్వాన్స్ సర్టిఫికెట్ ప్రోగ్రామ్: ప్రోగ్రామ్ వ్యవధి ఆర్నెల్లు. ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ, పవర్ డిస్ట్రిబ్యూషన్ మేనేజ్‌మెంట్ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి.

అప్రిసియేషన్ కోర్సు: కోర్సు వ్యవధి మూడు నెలలు.

సర్టిఫికెట్ ప్రోగ్రామ్: ప్రోగ్రామ్ వ్యవధి ఆర్నెల్లు.

డిప్లొమా: ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. బిజినెస్ ప్రాసెస్ అవుట్ సోర్సింగ్, క్రియేటివ్ రైటింగ్ ఇన్ ఇంగ్లీష్, డెయిరీ టెక్నాలజీ, ఎర్లీ చైల్డ్‌హుడ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్, ఫ్యాషన్ డిజైన్ అండ్ రిటైల్, హార్టికల్చర్, మీట్ టెక్నాలజీ, మోడరన్ ఆఫీస్ ప్రాక్టీస్, న్యూట్రిషన్ అండ్ హెల్త్ ఎడ్యుకేషన్, పారాలీగల్ ప్రాక్టీస్, థియేటర్ ఆర్ట్స్, టూరిజం స్టడీస్, ఉర్దూ, వాల్యూ ఎడ్యుకేషన్, వాటర్‌షెడ్ మేనేజ్‌మెంట్, ఉమన్ ఎంపవర్‌మెంట్ అండ్ డెవలప్‌మెంట్, అగ్రికల్చరల్ అండ్ కాస్ట్ మేనేజ్‌మెంట్, అప్పారెల్ మర్చండైజింగ్, రిటైలింగ్ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి.

డిగ్రీ ప్రోగ్రామ్‌లు: బీఏ, బీఏ ఆనర్స్, బీబీఏ, బీసీఏ, బీఎస్సీ, బీఎస్సీ ఆనర్స్ బీకాం, బీఎస్‌డబ్ల్యూ ప్రోగ్రామ్‌లు ఉన్నాయి. ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. బ్యాచిలర్ ఆఫ్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్సెస్ వ్యవధి ఏడాది.

పీజీ ప్రోగ్రామ్‌లు: ఎంఏ, ఎమ్మెస్సీ, ఎంకాం, ఎంటీటీఎం, ఎంబీఏ, ఎంసీఏ ప్రోగ్రామ్‌లు ఉన్నాయి. ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఎంఎల్ఐఎస్ ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది.

పీజీ డిప్లొమా: ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. అనలిటికల్ కెమిస్ట్రీ, కౌన్సెలింగ్ అండ్ ఫ్యామిలీ థెరపీ, గాంధీ అండ్ పీస్ స్టడీస్, ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ, యానిమల్ వెల్ఫేర్, అప్లయిడ్ స్టాటిస్టిక్స్, ఆడియో ప్రోగ్రామ్ ప్రొడక్షన్, బుక్ పబ్లిషింగ్, కార్పొరేట్ అండ్ సోషల్ రెస్పాన్సిబిలిటీ, డెవలప్‌మెంట్ స్టడీస్, డిస్టెన్స్ ఎడ్యుకేషన్, ఎడ్యుకేషనల్ టెక్నాలజీ తదితర స్పెషలైజేషన్‌లు ఉన్నాయి.

పీజీ సర్టిఫికెట్: ప్రోగ్రామ్ వ్యవధి ఆర్నెల్లు. అగ్రికల్చర్ పాలసీ, క్లయిమేట్ ఛేంజ్, జియో ఇన్ఫర్మాటిక్స్, ఇండస్ట్రియల్ సేఫ్టీ, ఇన్వెంటరీ ప్లానింగ్ అండ్ వేర్ హౌసింగ్ సిస్టమ్ ఫర్ ఇంజనీర్స్, మలయాళం-హిందీ ట్రాన్స్‌లేషన్ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 15
- **వెబ్‌సైట్:** ignouadmission.samarth.edu.in

ఎన్‌పీటీఐలో పీజీ డిప్లొమాలు

ఫరీదాబాద్‌లోని నేషనల్ పవర్ ట్రెయినింగ్ ఇన్‌స్టిట్యూట్(ఎన్‌పీటీఐ)- పీజీ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. నిబంధనల ప్రకారం కోర్సులు పూర్తిచేసినవారికి ప్లేస్‌మెంట్స్ కల్పిస్తారు. మహిళలకు ప్రోగ్రామ్ ఫీజులో పది శాతం రాయితీ లభిస్తుంది. పవర్ సంస్థలు స్పాన్సర్ చేసే అభ్యర్థుల కోసం 25 శాతం సీట్లు కేటాయించారు. అకడమిక్ మెరిట్ ఆధారంగా మెరిట్ లిస్ట్ రూపొందించి కౌన్సెలింగ్‌ల ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.

పీజీ డిప్లొమా ఇన్ పవర్ ప్లాంట్ ఇంజనీరింగ్: కోర్సు వ్యవధి ఏడాది. ఫరీదాబాద్, నాగ్‌పూర్, నైవేలీ, దుర్గాపూర్, అలప్పుజా, శివ్‌పురి సెంటర్లలో ఈ ప్రోగ్రామ్ అందుబాటులో ఉంది. ఒక్కో సెంటర్లో 60 సీట్లు చొప్పున మొత్తం 360 సీట్లు ఉన్నాయి.

పీజీ డిప్లొమా ఇన్ హైడ్రో పవర్ ప్లాంట్ ఇంజనీరింగ్: కోర్సు వ్యవధి తొమ్మిది నెలలు. నంగల్ సెంటర్లో ఈ ప్రోగ్రామ్ ఉంది. ఇక్కడ 60 సీట్లు ఉన్నాయి.

పీజీ డిప్లొమా ఇన్ రెన్యూవబుల్ ఎనర్జీ అండ్ గ్రిడ్ ఇంటర్ఫేస్ టెక్నాలజీస్: కోర్సు వ్యవధి ఏడాది. న్యూఢిల్లీ, శివ్‌పురి, నైవేలీ, అలప్పుజా సెంటర్లలో ఈ ప్రోగ్రామ్ ఉంది.

అర్హత వివరాలు: గుర్తింపు పొందిన కళాశాల నుంచి ప్రథమ శ్రేణి మార్కులతో (బీఈ/బీటెక్)(మెకానికల్/ఎలక్ట్రికల్/ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్/సీ అండ్ ఐ/పవర్ ఇంజనీరింగ్) ఉత్తీర్ణులై ఉండాలి. రెన్యూవబుల్ ఎనర్జీ అండ్ గ్రిడ్ ఇంటర్ఫేస్ కోర్సుకు ఏ ఇంజనీరింగ్ విభాగంవారైనా దరఖాస్తు చేసుకోవచ్చు. గరిష్ఠ వయోపరిమితి నిబంధనలు లేవు.

- **దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 28
- **టెలిఫోనిక్ ఇంటర్వ్యూ:** జూలై 30, 31
- **అభ్యర్థుల మెరిట్ లిస్ట్ విడుదల:** ఆగస్టు 2
- **కౌన్సెలింగ్:** ఆగస్టు 5, 6
- **కోర్సులు ప్రారంభం:** ఆగస్టు 12 నుంచి
- **మిగిలిన సీట్లకు స్పాట్ అడ్మిషన్స్:** ఆగస్టు 22
- **వెబ్‌సైట్:** www.npti.gov.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్
https://ejyothy.com/V9yZi4uలో చదవండి.



సెప్టెంబర్ ఒకటిన బాలకృష్ణకు భారీ సన్మానం



'తాతమ్మ కల' (1974) చిత్రంతో తన నట జీవితాన్ని ప్రారంభించారు నందమూరి బాలకృష్ణ. వైవిధ్యమైన పాత్రలు పోషిస్తూ 50 ఏళ్లుగా హీరోగా కొనసాగుతున్న ఏకైక కళాకారుడు ప్రపంచంలో ఆయన ఒక్కరే అంటే అది అతిశయోక్తి కాదు. అంతేకాదు తండ్రి, మహానటుడు ఎన్టీఆర్ మార్గాన్ని అనుసరించి రాజకీయాల్లోకి ప్రవేశించి హిందూపురం నియోజక వర్గం నుంచి మూడు సార్లు వరుసగా శాసనసభ్యుడిగా ఎన్నికై హ్యాట్రిక్ సాధించారు. ఇలా సినీరంగంలోనూ, రాజకీయ రంగంలోనూ సత్తా చాటుతూ 50 ఏళ్ల కెరీర్ పూర్తి చేసుకున్న బాలకృష్ణను తెలుగు చిత్రపరిశ్రమ సెప్టెంబర్ ఒకటిన ఘనంగా సత్కరించనుంది. ఈ మేరకు తెలుగు నిర్మాతలమండలి కార్యదర్శి దామోదర ప్రసాద్, నిర్మాతలమండలి కార్యదర్శి ప్రసన్నకుమార్, తెలంగాణ స్టేట్ ఫిల్మ్ ఛాంబర్ అధ్యక్షుడు సునీల్ నారంగ్, ఫెడరేషన్ అధ్యక్షుడు అనిల్ కలవగా, బాలకృష్ణ ఈ సన్మానానికి తన అంగీకారం తెలిపారు. బాలీవుడ్, ఇతర సినీ రంగాలకు చెందిన ప్రముఖులు కూడా ఈ సన్మాన సభకు హాజరవుతారని సమాచారం.

షూటింగ్ మొదలుపెట్టారు



విక్టరీ వెంకటేశ్, దర్శకుడు అనిల్ రావిపూడి కాంబినేషన్‌లో రూపుదిద్దుకుంటున్న తాజా చిత్రం రెగ్యులర్ షూటింగ్ గురువారం మొదలైంది. వెంకటేశ్ సరసన మీనాక్షి చౌదరి, ఐశ్వర్య రాజేశ్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఓ పోలీస్ ఆఫీసర్, ఆయన భార్య, మాజీ ప్రేయసి.. ఇలా మూడు పాత్రల చుట్టూ తిరిగే వినోద భరిత చిత్రమిదని, ఇందులో క్రైమ్ ఎలిమెంట్ కూడా మిళితమై ఉంటుందని దర్శకుడు అనిల్ రావిపూడి చెప్పారు. ప్రస్తుతం ప్రారంభమైన షూటింగ్‌లో చిత్రంలోని ముఖ్య తారాగణమంతా పాల్గొంటోంది. ఈ సినిమాను సంక్రాంతికి విడుదల చేయనున్నట్లు చిత్ర నిర్మాత శిరీష్ చెప్పారు. దిల్ రాజు ఈ సినిమాకు సమర్పకుడు. ఈ చిత్రానికి సమీర్‌రెడ్డి ఛాయాగ్రాహకుడు, భీమ్స్ సిసిరోలియో సంగీత దర్శకుడు.

ఉత్తమ నటులుగా ఎన్టీఆర్, రామ్‌చరణ్ ఉత్తమ నటిగా సాయి పల్లవి

ఫిల్మ్‌ఫేర్ సౌత్ ఇండియన్ అవార్డుల సందడి





జాతీయ చలనచిత్ర అవార్డుల తర్వాత భారతీయ చిత్ర పరిశ్రమ ప్రతిష్ఠాత్మకంగా భావించే ఫిల్మ్‌ఫేర్ సౌత్ ఇండియన్ అవార్డులను గురువారం ప్రకటించారు. అంతర్జాతీయంగా ప్రతిష్ఠాత్మకమైన అవార్డులు పొందిన 'ఆర్ ఆర్ ఆర్' చిత్రం తెలుగు విభాగంలో ఉత్తమ చిత్రంగా ఎంపికైంది. ఉత్తమ నటులుగా ఎన్టీఆర్, రామ్‌చరణ్, ఉత్తమ దర్శకుడిగా రాజమౌళి ఎన్నికయ్యారు. 'విరాటపర్వం' చిత్రంలో నటించిన సాయిపల్లవి ఉత్తమ నటిగా ఎంపికయ్యారు. 'భీమ్లా నాయక్'లో నటించిన రానా ఉత్తమ సహాయ నటుడిగా, 'విరాటపర్వం'లో నటించిన నందితా దాస్, 'సీతారామం'లో నటించిన మృణాల్ ఠాకూర్ ఉత్తమ సహాయ నటీమణులుగా, ఉత్తమ గేయ రచయితగా సీతారామశాస్త్రి (సీతారామం) ఎన్నికయ్యారు. తమిళంలో ఉత్తమ నటుడిగా కమల్ హాసన్ (విక్రమ్) ఉత్తమ నటిగా ఊర్వశి, ఉత్తమ చిత్రంగా 'పొన్నియిన్ సెల్వం 1', ఆ సినిమాకు దర్శకత్వం వహించిన మణిరత్నం ఉత్తమ దర్శకుడిగా ఎన్నికయ్యారు. కన్నడంలో 'కాంతార', మలయాళంలో 'న్నా థాన్ కేసు కుడు' ఉత్తమ చిత్రాలుగా ఎన్నికయ్యాయి.

వినోదాత్మకంగా డార్లింగ్



అశ్విన్‌రామ్ దర్శకత్వం వహించిన చిత్రం 'డార్లింగ్'. ప్రియదర్శి నభానటేశ్ జంటగా నటించగా, కె.నిరంజన్‌రెడ్డి, చైతన్య నిర్మించారు. ఈ నెల 19న విడుదలవుతోంది. ఈ సందర్భంగా అశ్విన్‌రామ్ మీడియాతో ముచ్చటించారు. "కొత్త జంట పెళ్లిని ఎలా హ్యాండిల్ చేస్తారనేది ఇందులో వినోదాత్మకంగా చూపించా. సినిమాల ద్వారా సందేశాలు ఇవ్వడం నాకు ఇష్టం ఉండదు. ఈ సినిమాలో ఎంటర్టైన్‌మెంట్‌తో పాటూ ఓ సామాజిక బాధ్యతను కూడా జత చేశా. ఇందులో కథానాయకుడి పాత్ర చాలా అమాయకంగా.. కథానాయిక పాత్ర చలాకీగా ఉండాలి. అలా ఆ పాత్రలకి సరిపోయే నటీనటులను పరిశీలించాక.. ప్రియదర్శి, నభానటేశ్ వందశాతం సరిపోతారని అనిపించి వారిని తీసుకున్నాం. నభా పాత్రలో చాలా షేడ్స్ ఉంటాయి.. సినిమాలో నభా మీ అందరినీ పూర్తిగా ఆశ్చర్యానికి గురిచేస్తుంది. వినోదంతో పాటు భావోద్వేగాలని సమపాళ్లలో మిక్స్ చేసి తీసిన ఈ సినిమాలో.. హీరో హీరోయిన్ల మధ్యన వచ్చే సన్నివేశాలు అందరినీ కడుపుబ్బా నవ్విస్తాయి. నిర్మాతలు ఎక్కడా రాజీ పడకుండా మేకింగ్ విషయంలో పూర్తి స్వేచ్ఛనిచ్చారు.

అద్భుతమైన విజువల్స్‌తో..



వరుణ్ సందేశ్ నటిస్తున్న చిత్రం 'విరాజీ'. ఆద్యంత్ హర్ష దర్శకత్వంలో మహేంద్రనాథ్ కూండ్ల నిర్మిస్తున్నారు. ఆగస్టు 2న సినిమా విడుదలవుతుంది. ఈ సినిమా ఫస్ట్ లుక్ టీజర్‌ను దర్శకుడు సాయి రాజేశ్ చేతుల మీదుగా విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "టీజర్‌లో విజువల్స్ అద్భుతంగా ఉన్నాయి. వరుణ్ లుక్ అదిరిపోయింది" అని చెప్పారు. "ఈ చిత్రం నాకు చాలా స్పెషల్" అని వరుణ్ సందేశ్ అన్నారు. "ఈ సినిమాలో చాలా ఆసక్తికరమైన అంశాలు ఉన్నాయి. వాటిని థియేటర్లలో చూసి ఆశ్చర్యపోతారు" అని దర్శకుడు ఆద్యంత్ హర్ష తెలిపారు.

ముందు రిసెప్షన్.. తర్వాత పెళ్లి!



వైవిధ్యమైన పాత్రలు పోషిస్తూ మంచి నటిగా తెలుగువారికి దగ్గరైన తమిళ నటి వరలక్ష్మి తన పెళ్లి వేడుకలోనూ వైవిధ్యం చూపించారు. వారం రోజుల క్రితం చెన్నైలో వరలక్ష్మి, నికోలై సచిదేవ్‌ల పెళ్లి రిసెప్షన్ చెన్నైలో జరిగింది. ఈ వేడుకకు పలువురు చిత్ర ప్రముఖులు హాజరయ్యారు. ఇలా అందరి అభినందనలు అందుకున్న వరలక్ష్మి, నికోలై సచిదేవ్ మంగళవారం థాయ్‌లాండ్‌లోని క్రాబి బీచ్ రిసార్ట్‌లో పెళ్లి చేసుకున్నారు. కుటుంబ సభ్యులు, అతికొద్దిమంది సన్నిహితుల మధ్య తమిళ సంప్రదాయానికి అనుగుణంగా ఈ పెళ్లి జరిగింది.

అనౌన్స్‌మెంట్ వీడియోతోనే సంచలనం



సత్యం రాజేశ్, బాలాదిత్య, గెటప్ శ్రీను ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన 'పొలిమేర 2' బాక్సాఫీస్ వద్ద ఊహించని సక్సెస్‌ను అందుకుని హారర్ థ్రిల్లర్ జానర్ సినిమాల్లో సరికొత్త ట్రెండ్ క్రియేట్ చేసిన సంగతి తెలిసిందే. 2021లో 'మా ఊరి పొలిమేర' చిత్రం ఓటీటీ సంస్థ 'డిస్నీ ప్లస్ హాట్‌స్టార్‌లో విడుదలై అందరినీ మెప్పించింది .'మా ఊరి పొలిమేర'కు సీక్వెల్‌గా వచ్చిందే 'పొలిమేర 2'. గతేడాది నవంబరులో విడుదలైన ఈ సక్సెస్‌ఫుల్ హారర్ థ్రిల్లర్ ఫిల్మ్‌కు కొనసాగింపుగా ఇంకో భాగం ఉంటుందని మేకర్స్ అప్పుడే ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తించారు. తాజాగా, 'పొలిమేర 3'ను మేకర్స్ ప్రకటించారు. ఈ సందర్భంగా విడుదల చేసిన అనౌన్స్‌మెంట్ వీడియో సంచలనం సృష్టిస్తోంది. ఈ వీడియో రిలీజైన కొద్దిసేపటికే ఎక్స్‌లో దేశవ్యాప్తంగా ట్రెండ్ అవుతూ టాప్ ప్లేస్‌ను ఆక్రమించింది. మూడో భాగాన్ని మొదటి రెండు పార్టులకు దర్శకత్వం వహించిన అనిల్ విశ్వనాథ్ తెరకెక్కించనున్నారు. భోగేంద్ర గుప్తా, వంశీ నందిపాటి సంయుక్తంగా నిర్మించనున్నారు. ప్రస్తుతం ఈ సినిమా ప్రీ ప్రొడక్షన్ పనుల్లో ఉన్నట్లు మేకర్స్ వెల్లడించారు. 'పొలిమేర 3' లో సత్యం రాజేష్, బాలాదిత్య, కామాక్షి భాస్కర్ల, గెటప్ శ్రీను, రవి వర్మ, రాకేందు మౌళి, చిత్రం శ్రీను, సాహిత్య దాసరి ప్రధాన పాత్రల్లో నటించనున్నారు.





ల్యాబ్ లేదు.. గదులు చాలవు

● కూటమి ప్రభుత్వంపైనే విద్యార్థుల తల్లిదండ్రులు ఆశలు ● ఇదీ కంచిలి జూనియర్ కళాశాలలో పరిస్థితి

కంచిలి: కంచిలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సమస్యలు తిష్ఠవేశాయి. ప్రధానంగా తరగతుల నిర్వహణకు గదులు సరిపోవడం లేదు. అంతేకాకుండా ల్యాబ్‌సదుపాయం లేకపోవడంతో ప్రయోగాలకు సైన్స్ విద్యార్థులు అగచాట్లకు గురవుతున్నారు. దీనికితోడు అధ్యాపకుల కొరత కూడా వేధిస్తోంది. ఇటీవల పిడుగుపాటుకు కళాశాలలోని కంప్యూటర్లు, విద్యుత్ పరికరాలు కాలిపోయాయి.



కళాశాల వద్ద పూర్తికాని భవన నిర్మాణం

ఇదీ పరిస్థితి..

కంచిలితోపాటు మండలంలోని జలంత్రకోట, జె.మాణిక్యపురం, ముండల, ఎక్కల, అర్జునాపురం, ఘాటి, రేఖాదేవిపురం, జిల్లుండలకు చెందిన విద్యార్థులతో పాటు పక్కనే ఉన్న కవిటి మండలానికి చెందిన జమేదారుపుట్టుగ, బెలగాం, సహలాల పుట్టుగ, కొన్నాయిపుట్టుగ, మెళియాపుట్టుగ, భైరాగిపుట్టుగ తదితర గ్రామాలకు చెందిన 230 మంది ఇక్కడ చదువుతున్నారు. ప్రస్తుతం 2024-25 విద్యా సంవత్సరంలో ప్రథమ సంవత్సరంలో 120 మంది, ద్వితీయ సంవత్సరంలో110 మంది విద్యార్థులు అభ్యసిస్తున్నారు. సైన్స్ గ్రూపులో 30 మంది చదువుతుండగా ల్యాబ్‌సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందిపడుతున్నారు. ఇక్కడ నాలుగు గ్రూపులు, తెలుగు, ఇంగ్లీష్, ఒడియా మీడియంలో నిర్వహిస్తుండగా ఇక్కడ కేవలం ఎనిమిది గదులు మాత్రమే ఉండడంతో వసతి సమస్య తీవ్రంగా వేధిస్తోంది. ఒక గది ప్రిన్సిపాల్ రూము కం ఆఫీస్ కార్యాలయంగా వినియోగిస్తుండగా, ఇంకో గదిని సిబ్బంది, గ్రంథాలయానికి ఉపయోగిస్తున్నారు. మిగిలిన ఆరు గదుల్లోనే తరగతులు నిర్వహిస్తున్నారు. దీంతో మధ్యాహ్న సమయంలో విద్యార్థులు భోజనాలు చేసేందుకు ఇబ్బందులుపడాల్సి వస్తోంది. కళాశాలలో తరగతుల నిర్వహణకు పూర్తిస్థాయిలో 15 మంది అధ్యాపకులు అవసరం కాగా, కేవలం ఇద్దరు అధ్యాపకులు మాత్రమే రెగ్యులర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. మరో 10 మంది అధ్యాపకులు కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తుండగా ఎకనామిక్స్ గెస్ట్ ఫ్యాకల్టీ బోధిస్తున్నారు. ఈ ఏడాది ఇప్పటి వరకూ కాంట్రాక్ట్ అధ్యాపకులు, గెస్ట్ ఫ్యాకల్టీకి రెన్యువల్ ఆర్డర్స్ రాలేదు. ఈ నేపథ్యంలో కళాశాల నిర్వహణ తదితర అంశాలకు సంబంధించి బోధనేతర సిబ్బంది నలుగురు ఉండాల్సిఉండగా కేవలం ఒక్కరు మాత్రమే ఉన్నారు. దీంతో కళాశాలలో కార్యకలాపాలు సజావుగా సాగడంలేదు. కళాశాల చుట్టూ ప్రహరీ లేకపోవడంతో తరగతుల నిర్వహణకు ఇబ్బందులు కలుగుతున్నాయి. సమీపంలోని కాలనీ నుంచి జాతీయరహదారికి వెళ్లేందుకు కళాశాల మధ్యలో నుంచే రాకపోకలు సాగిస్తున్నారు. ద్విచక్రవాహన చోదకులు కళాశాలలో శబ్దాలు చేస్తుండడంతో పాటు పశువులు సైతం కళాశాల ప్రాంగణంలోకి వస్తుండడంతో విద్యార్థులు అవస్థలకు గురవుతున్నారు. కాగా గతంలో కళాశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణం, ప్రహరీ ఏర్పాటుపై అప్పట్లో ప్రిన్సిపాల్, సిబ్బంది ఉన్నతాధికారులకు వినతిపత్రాలు అందించిన విషయం విదితమే. పత్రికల్లో కథనాలు రావడంతో అధికారులు ప్రతిపాదనలు సిద్ధంచేసి పంపించారు. అయితే ఏళ్లు గడుస్తున్నా కళాశాల ప్రతిపాదనల స్థాయి దాటడంలేదు.



ప్రహరీ లేని కంచిలి ప్రభుత్వ కళాశాల

గురుకులంలో సమస్యల పరిష్కారానికి చర్యలు

● పాతపట్నంలో కలెక్టర్ పర్యటన



పాఠశాలలో నీటి ట్యాంకును పరిశీలించేందుకు నిచ్చెన ఎక్కుతున్న కలెక్టర్

పాతపట్నం: పాతపట్నంలో బీఆర్ అంబేడ్కర్ గురుకుల ఆశ్రమ బాలికల పాఠశాలలో సమస్యల పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ హామీఇచ్చారు. గురువారం సాయంత్రం పాతపట్నంలో కలెక్టర్ సుడిగాలిపర్యటన చేశారు. తొలుత బీఆర్ అంబేడ్కర్ గురుకుల ఆశ్రమ బాలికల పాఠ శాల కార్యాలయంలో ప్రిన్సిపాల్‌కు పలుఅంశాల పై ప్రశ్నించారు.కిచెన్‌లో వంటల నిర్వహణ, స్టోర్ రూపంలో కూరగాయలు,గుడ్లు పరిశీలించారు. వంట భవనం పైభాగంలోఉన్న వాటర్‌ట్యాంక్‌ను పరిశీలించేందుకు నిచ్చెనను వేయించి ఎక్కారు. తాగునీటిలో టీడీఎస్ ఎంతుందో పరిశీలించాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. అనంతరం విద్యార్థులతో సమస్యలపై మాట్లాడారు. వారితో సహపంక్తి భోజనం చేశారు.అనంతరం స్థానిక 50 పడకల సీహెచ్‌సీని పరిశీలించారు.ఆయన వెంట తహసీల్దార్ ప్రసాదరావు, అధికారులు కృష్ణవేణి, కళ్యాణరాం, రామకృష్ణరాజు పాల్గొన్నారు.

ఇసుక అక్రమంగా తవ్వితే కేసులు

నరసన్నపేట:రాత్రి సమయాల్లో అక్రమంగా ఇసుక తవ్వకాలు చేపడితే నూతన చట్టం ప్రకారం కేసులు నమోదు చేసి అపరాద రుసుం వసూళ్లు చేస్తామని తహసీల్దార్ కనకరావు తెలిపారు. గురువారం వెంకటాపురం, లుకలాం, చేనులవలస, బుచ్చిపేట, గోపాలపెంట, మడపాం గ్రామాల వద్ద వంశధార నదీ తీర ప్రాంతాల్లో పోలీసులు ఆధ్వర్యంలో కందకాలు ఏర్పాటు చేశారు. పలు గ్రామాల్లో నదితీర గ్రామాల్లో ఇసుక అక్రమ నిల్వలను పరిశీలించారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ అసిరినాయుడు, వీఆర్వో అప్పలనాయుడు పాల్గొన్నారు.

పట్టుబడిన ట్రాక్టర్లు

గోపాలపెంట ర్యాంపు నుంచి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లు ఎస్‌ఈబీ అధికారులు పట్టుకున్నారు.ఇసుకను ట్రాక్టర్లతో రవాణా చేస్తున్నట్లు ఎస్‌ఈబీ ఏఎస్పీ శ్రీనివాసరావుకు వచ్చిన సమాచారం మేరకు దాడులు చేశారు. గోపాలపెంట ఇసుక ర్యాంపులో పది ట్రాక్టర్లు లోడ్లతో పరారీ కాగా దేవాది వద్ద ఒకటి అధికారులకు పట్టుబడింది. చెన్నాపురం వద్ద మరో ఇసుక ట్రాక్టర్ పట్టుకున్నారు.

కూటమి ప్రభుత్వంలో మెరుగైన సేవలు: పిసిని

నందిగాం: కూటమి ప్రభుత్వంలో ప్రజలకు మెరుగైన సేవలందిస్తామని జనసేన జిల్లాఅధ్యక్షుడు పిసిని చంద్రమోహన్ తెలిపారు. గురువారం కవిటి అగ్రహారంలో జనసేన ఆధ్వర్యంలోపార్టీ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో టెక్కలి, పలాస నియోజకవర్గాల ఇన్‌చార్జిలు కణితి కిరణ్‌కుమార్, వైదుర్గారావు, జిల్లా ప్రతినిధి ఎస్.షణ్ముఖరావు, మండలశాఖ అధ్యక్షులు తాడేల చిరంజీవి, టీడీపీ నాయకులు పి.శివకృష్ణ, బారికి, సన్యాసిరావు పాల్గొన్నారు.

గంజాయి రవాణాను అరికట్టాలి

కాశీబుగ్గ: పలాస కేంద్రంగా గంజాయి రవాణా అరిక ట్టాలని ఏఐవైఎఫ్ నాయకులు కోరారు. గురువారం కాశీబుగ్గ గాంధీ విగ్రహం వద్ద ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి మెజ్జాడ యుగంధర్, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గోరు వాసు, కొన్న శ్రీనివాసరావు ధర్నా నిర్వహించారు.కార్యక్రమంలో నాయకులు గుణశేఖర్, దిలీప్, వెంకటరావు, వల్లభరావు, సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

వరుణుడి కరుణ కోసం మహాకుంభాభిషేకం

నరసన్నపేట: మండలంలోని దూకలపాడులో జ్యోతి రామలింగేశ్వరాలయంలో వరుణుడు కరుణించాలని మహా కుంభాభిషేకాన్ని గురువారం గ్రామస్థులు నిర్వహించారు. వర్షాలు కురవాలని గ్రామస్థులు బిందెలతో రామలింగేశ్వర స్వామికి జలభిషేకం చేశారు. కార్యక్రమంలో అర్చకులు గణేష్‌స్వామి పాల్గొన్నారు.

హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి

కోటబొమ్మాళి:ద్విచక్రవాహనచోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని మండల న్యాయసేవాసంఘం అధ్యక్షురాలు, సివిల్ న్యాయాధికారి బీఎంఆర్ ప్రసన్నలత తెలిపారు. గురువారం కోటబొమ్మాళిలో న్యాయవాదులు, వాహన చోదకులు ర్యాలీ నిర్వహించి హెల్మెట్ ధరించడంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు ఎల్. శ్రీనివాస్, నారాయణ రావు, తిరుమలరావు, వాసుదేవరావు, డి. నరసింహమూర్తి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

టెక్కలి: కె.కొత్తూరు ఫీడర్ పరిధిలో వార్షిక మరమ్మతుల నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఈఈ జి.శంకరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8నుంచి మధ్యాహ్నం 2 గంటలవరకు ఫీడర్‌పరిధిలోని భగవాన్‌పురం, చెట్లతాండ్ర, అక్కవరం, చాకిపల్లి, కె.కొత్తూరు పరిధిలో సరఫరాకు అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు.

కొత్తగ్రహారం సబ్‌స్టేషన్ పరిధిలో..

నందిగాం: మండలంలోని కొత్తగ్రహారం సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ, దేవుపురం ఫీడర్ పరిధిలో నిర్వహణ పనుల నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు టెక్కలి విద్యుత్ ఈఈ జి.శంకరరావు ఒకప్రకటనలో తెలిపారు. ఫీడర్‌పరిధిలో జంగిల్ క్లియరెన్స్ తదితర పనులు నిమిత్తం తురకలకోట, జడ్యాడ, కాపుతెంబూరు, బోరుభద్ర,బడగాం, దేవుపురం, సింగుపురం, లవునిపల్లి, వజ్జీలపేట తదితర గ్రామాలకు ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం రెండుగంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని పేర్కొన్నారు.

నేడు న్యాయ అవగాహన సదస్సు

టెక్కలి:కె.కొత్తూరు దరి ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించనున్నట్లు టెక్కలిసీనియర్ సివిల్ న్యాయాధికారి జె.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు.

రేపు మండల సమావేశం

నందిగాం:నందిగాం మండల సర్వసభ్య సమావేశం శనివారం జరపనున్నట్లు ఎంపీడీవో టి.రాజారావు ఒక ప్రకటనలో తెలిపారు.ఉదయం 10.30గంటలకు ఎంపీపీ నడుపూరి శ్రీరామ్మూర్తి అధ్యక్షతన జరిగే సమావేశానికి అధికారులు హాజరుకావాలని కోరారు.

15న నేత్ర వైద్యశిబిరం

మందస: మందససత్యసాయి బృందావన్‌లో ఈనెల 15న ఉచితనేత్ర వైద్యశిబిర నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఒకప్రకటనలో తెలిపారు. విశాఖశంకర్ ఫౌండేషన్ వైద్యనిపుణులతో పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. క్యాటరాక్ట్ ఆపరేషన్ నిర్వహిస్తారని, 94945 88963నెంబరుకు సంప్రదించాలని తెలిపారు.

రైతాంగ పోరాట యోధులకు నివాళి

నరసన్నపేట:మండలంలోని కోమర్తి న్యూకాలనీలో శ్రీకాకుళం గిరిజన రైతాంగ సాయుధ పోరాట యోధులు వెంపటాపు సత్యం, ఆదిభట్ల కైలాసంలకు 54వ వర్ధంతి పురస్కరించుకుని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో గురువారం నివాళులర్పించారు.కార్యక్రమంలో సంఘ నాయకులు నీలంరాజు, పి.దాలినాయుడు, వెంకట్రావు, కపేరుతాత, పెదలాపు దుర్గమ్మ, గన్నెమ్మ, వరహాలు,లక్ష్మమ్మ, అప్పమ్మ, సన్యాసమ్మ పాల్గొన్నారు.

డ్రైడేను అమలుచేయాలి

పోలాకి: ప్రతి పంచాయతీలో శుక్రవారం పారిశుధ్య పనులు చేపట్టి డ్రైడేను అమలుచేయాలని ఎంపీడీవో కె.ఉష్‌శ్రీ తెలిపారు. గురువారం పోలాకిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ పారిశుధ్యపనుల పర్యవేక్షణను పంచాయతీ అధికారి పద్మావతి, సీఆర్‌పీ దంతకృష్ణకు అప్పగించామని చెప్పారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి

హిరమండలం: పాఠశాలల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని ఎంపీడీవో స్వరూపరాణి తెలిపారు. గురువారంహిరమండలంలోని కేజీబీవీప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీచేశారు. ఈసందర్భంగా కేజీబీవీలో మధ్యాహ్న భోజనం పరిశీలించారు.

అట్రాసిటీ కేసుపై దర్యాప్తు

జలుమూరు:మండలంలోని సైరిగాం పంచాయతీ లింగన్నాయుడుపేట గ్రామానికి చెందిన గొర్లె అచ్చయ్య తనను కులం పేరుతో దూషించారని ఇచ్చిన ఫిర్యాదు మేరకు శ్రీకాకుళం స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ ఎ.త్రినాథరావు గురువారం గ్రామంలో దర్యాప్తు నిర్వహించారు. ఫిర్యాదుదారునితోపాటు గ్రామస్థులను విచారించారు. దర్యాప్తుజరిపి నివేదిక జిల్లాఅధికారులకు అందజేయనున్నట్లు డీఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో నరసన్నపేట సీఐ బి.ప్రసాదరావు, హెచ్‌పీ రాజశేఖర్ పాల్గొన్నారు.

ఏడీఎం మృతి

ఒడిశా

పర్లాకిమిడి: గజపతిజిల్లా రెవెన్యూ ఏడీఎం బిరేంద్ర కుమార్ దాస్ మృతిచెందారు. బుధవారం రాత్రి స్థానిక బృందావన్ పేలస్‌లో జరిగిన ఓ కార్యక్రమానికి హాజరై స్టేజ్‌పై భక్తి గీతం ఆలపిస్తుండగా అస్వస్థతకు గురై కుప్పకూలిపోయారు. దీంతో జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించి ప్రథమచికిత్స అందించారు. మెరుగైన చికిత్స కోసం బరంపురం తరలించగా అక్కడ మృతిచెందారు. ఆయన మృతిపై జిల్లా అధికారులు, ప్రముఖులు సంతాపం తెలిపారు.

రాజీయే సరైన మార్గం

పర్లాకిమిడి : రాజీయే సరైన మార్గమని, రాజీతో పెండింగ్ కేసులు పరిష్కారం అవుతాయని రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ డాక్టర్ మినతి బెహరా తెలిపారు. గురువారం పర్లాకిమిడిలోని కలెక్టరేట్‌లో క్యాంప్ కోర్టు నిర్వహించారు. కార్యక్రమంలో సభ్యురాలు సుజాత డిగల్, న్యాయవాది అరవింద్ పాల్గొన్నారు



మాట్లాడుతున్న మినతిబెహరా

సాగునీటి వనరులు అభివృద్ధి చేస్తాం

● పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష



వజ్రపుకొత్తూరు: వంశధార కాలువ వద్ద జలహారతి ఇస్తున్న శిరీష

పలాస:ప్రధాన సాగునీటి వనరులన్నీ అభివృద్ధి చేస్తామని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష తెలిపారు. గురువారం స్థానిక టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గానికి వంశధార నీరురావడంతో రైతులు, టీడీపీ నాయకులు శిరీషకు అభినందించారు. కార్యక్రమంలో పీరుకట్ల విఠల్‌రావు, దువ్వాడ సంతోష్, కుత్తుమ లక్ష్మణకుమార్, కిక్కర ఢిల్లీరావు, వంకల కూర్మారావు పాల్గొన్నారు.

● **పలాస రూరల్:** హామీమేరకు 20రోజుల్లోనే వంశధార నీరును శివారు ప్రాంతానికి అందించామని ఎమ్మెల్యే శిరీష తెలిపారు.పలాస మండల టీడీపీ విస్తృత స్థాయి సమావేశం కార్యాలయంలో పార్టీ మండలాధ్యక్షుడు కుత్తుమ లక్ష్మణ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా నాయకులు ఎమ్మెల్యేను సత్కరించారు.కార్య క్రమంలో లక్ష్మణ్‌కుమార్, పీరికట్ల విఠల్‌రావు, హర్ష నాయుడు,సంతోష్‌కుమార్, మోహనరావు, కుమార్‌రాజు, ఢిల్లీరావు,వంకల కూర్మారావు, హారియా మోహనరావు, అవుగాన షణ్ముఖరావు పాల్గొన్నారు.

● **వజ్రపుకొత్తూరు:** ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో సాగునీటికి తీవ్ర నిర్లక్ష్యం జగిరిందని ఎమ్మెల్యే గౌతు శిరీష ఆరోపించారు. గురువారం సాయంత్రం మండలంలోని పొల్లాడ గ్రామానికి సమీపంగల కాలువ వద్ద వంశధార నీటికి జల హారతిచ్చారు.కార్యక్రమంలో నాయకులు సూరాడ మోహనరావు, పుచ్చ ఈశ్వర రావు, కర్ని రమణ, మల్లా సూర్యం, గొరకల వసంతరావు, విఠల్, శశిభూషన్, కె.ఆదినారాయణ, అఖిల్ పాల్గొన్నారు.

పట్టణాభివృద్ధికి కృషి

● నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి



నరసన్నపేటలో కందిపప్పు విక్రయ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న రమణమూర్తి

నరసన్నపేట:పట్టణాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి తెలిపారు. గురువారం పట్టణంలోని లచ్చుమన్నపేటలో కందిపప్పువిక్రయ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అధికారంలో వచ్చిన నెలరోజుల్లో ఎన్నోఅభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు కూటమి ప్రభుత్వం నాంది పలికిందన్నారు. బియ్యం, నిత్యావసర వస్తువుల ధరలను కళ్లెం వేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక కేంద్రాలు ద్వారా కందిపప్పును కిలో రూ.160లకు అందజేస్తుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ కనకరరావు, టీడీపీ మండలాధ్యక్షులు శిమ్మ చంద్రశేఖర్, గొద్దు చిట్టిబాబు, బోయన సతీష్, బోయన ఆనంద్, సాయిన్నశెట్టి, కింజరాపు రామరావు పాల్గొన్నారు.

చంద్రబాబును కలిసిన కలమట, ఎంజీఆర్

కొత్తూరు/పాతపట్నం : భోగాపురం వద్ద గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్ పోర్టు సందర్శనకు వచ్చిన సీఎం చంద్రబాబునాయుడును హెలిప్యాడ్‌వద్ద టీడీపీ జిల్లా అధ్యక్షుడు కలమట వెంకట రమణ గురువారం కలిశారు. పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు సీఎం చంద్రబాబు, పౌర విమానయానశాఖ రామ్మోహన్ నాయుడును కలిశారు.



చంద్రబాబుకు పుష్పగుచ్ఛాలు అందజేస్తున్న కలమట, ఎంజీఆర్

విద్యారంగ సమస్యలపై ప్రభుత్వానికి నివేదిక

● యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు

నందిగాం: ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలపై వివరాలు సేకరించి ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తామని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు తెలిపారు.గురువారం నందిగాం, నర్సిపురం ఉన్నత పాఠశాలలతోపాటు నర్సిపురం,మద్దిలినివానిపేట ప్రాథమిక పాఠశాలలను సందర్శించారు.ఆయన వెంట యూటీఎఫ్ జిల్లా అధ్యక్షప్రధానకార్యదర్శులుబాబూరావు, జి.శ్రీరామ్మూర్తి, రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిషోర్‌కుమార్, జిల్లాకార్యదర్శి బాలక శంకరరావు, సహాధ్యక్షులు దాలయ్య, కె.కుమారస్వామి, గణపతి ఉన్నారు.

రైతులకు ఎరువులు పంపిణీ

టెక్కలి:నర్సింగపల్లి రైతుసేవా కేంద్రంలో గురువారం మాజీ సర్పంచ్ పోలాకి షణ్ముఖరావు రైతులకు ఎరువులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గుజ్జారు సత్యం, దారపు పాపారావు, తిరుపతిరావు, యమున పాల్గొన్నారు.

●**సంతబొమ్మాళి:**గోవిందపురం పంచాయతీలోరైతలకు ఎరువులను టీడీపీ మండల కార్యదర్శి రెడ్డి అప్పన్న పంపిణీ చేశారు.కార్యక్రమంలో ఏవో అప్పారావు, అగ్రికల్చర్ అసిస్టెంట్ బాలకృష్ణ, సువ్వారి ప్రసాద్ పాల్గొన్నారు.

●**కొత్తూరు:** పారాపురం, కలిగాం పంచాయతీలో సర్పంచ్ కుంచాల రత్నాలమ్మ, జనసేననేత దొంపాక జయరాజు, రామారావు, పారాపురం ఏఈ పూర్ణిమ, టీడీపీ నాయకులు గేదెల శ్రీను రైతులకు ఎరువులు పంపిణీ చేశారు.

చాపరలో కందిపప్పు కేంద్రం...

మెళియాపుట్టి: చాపరలో కందిపప్పు కేంద్రాన్ని తహసీల్దార్ జానకమ్మ గురువారం ప్రారంభించారు.కార్యక్రమంలో టీడీపీ నాయకులు సలాన మోహన రావు, పైడిరాజ్, పరమేష్‌రెడ్డి, శ్రీను, పోలినాయుడు పాల్గొన్నారు.

రక్తహీనత మాత్రలు..

కొత్తూరు: విద్యార్థుల్లో రక్తహీనతను అధిగమించి ఆరోగ్యంగా ఉండడానికి ఈఐఎఫ్ఏ టాబ్లెట్లు దోహదపడతాయని కడుం జడ్పీ ఉన్నతపాఠశాల హెచ్‌ఎం తిరుమలరావు తెలిపారు. ఈమేరకు150 మందివిద్యార్థులకు కురిగాం పీహెచ్‌సీ, కుడం సబ్‌సెంటర్ సీహెచ్‌వో, ఎంఎల్‌హెచ్‌ఈ వైద్యురాలు విమలాదేవి ఆధ్వర్యంలో టాబ్లెట్స్ పంపిణీ చేశారు.

జనాభా నియంత్రణపై అవగాహన

పోలాకి: జనాభా నియంత్రణపై అవగాహన కల్పిస్తున్నామని జిల్లా మలేరియా విభాగ అధిపతి నల్లిరవికుమార్, పోలాకి పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీనాథ్ తెలిపారు. గురువారం పోలాకిలో ఆరోగ్యసిబ్బంది, ఆశా,అంగన్‌వాడీ కార్యకర్తల ఆధ్వర్యంలో ప్రపంచ జనాభా దినోత్సవం పురస్కరించుకుని సదస్సు నిర్వహించారు.ఈసందర్భంగా పోలాకిలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మంగం శేఖర్‌బాబు బరాటంలక్ష్మి పాల్గొన్నారు.

● **నరసన్నపేట:** అధిక జనాభాతో ఎన్నో అనర్థాలు వస్తాయని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ లత తెలిపారు.నరసన్నపేటలోని కళాశాల విద్యార్థులు అవగాహన ర్యాలీ చేపట్టారు. అలాగే తహసీల్దార్ కార్యాలయం వద్ద ర్యాలీ చేపట్టారు.

●**ఎల్.ఎన్.పేట:** స్థానిక కేజీబీవీలో విద్యార్థినులకు జనాభా పెరుగుదలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.కార్యక్రమంలో దివ్యాంగుల రాష్ట్ర ఉద్యోగసంఘం కార్యవర్గ సభ్యుడు మన్మథకుమార్ మిశ్రో, కేజీబీవీ పాఠశాల ప్రత్యేకాధికారి ఎం.అంబిక ఉపాధ్యాయులు టి.ఉపేంద్ర, స్వర్ణలత, సాయిబాల, సునీత, లీలావతి, ఈశ్వరి, అంగన్‌వాడి టీచరు సంగీత పాల్గొన్నారు.

ఉపాధ్యాయులపై విచారణ

పలాస రూరల్:పలాస ఎంఆర్సీలో గురువారం డిప్యూటీ డీఈవో విలియమ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల సస్పెండ్ కావడంపై విచారణచేపట్టారు. పెదంచల ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న బి.మాధవరావు, కాశీబుగ్గ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న టి.మన్మథరావులను ఎన్నికలకోడ్ అమలుఉన్న సమయంలో ఓ పార్టీ ప్రచారంలో పాల్గొన్నట్లు అధికారులు ధ్రువీకరించడంతో వారిని గతంలో సస్పెండ్ చేసిన విషయం విదితమే.కార్యక్రమంలో ఎంఈవోలు సీహెచ్ శ్రీనివాసరావు, సత్యం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొళాయిల ఏర్పాటుకు శంకుస్థాపన

టెక్కలి:అయోధ్యపురం పంచాయతీ సోమయ్యవలసలో ఇంటింటికి తాగునీటికి సంబంధించి కొళాయిల ఏర్పాటుకు గురువారం సర్పంచ్ బగాది హరి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు బల్లి ఢిల్లేశ్వరరావు, స్థానిక పెద్దలు జి.అశోక్, పి.ఢిల్లేశ్వరరావు, ఎం.చిన్నారావు, చలపతి పాల్గొన్నారు.

సాగర తీరంలో పోలీసుల తనిఖీలు

పోలాకి: గుప్పెడుపేట, గుల్లవానిపేట, కొత్తరేవు, రాజారాంపురం సాగరతీరంలో గురువారం పోలాకి పోలీసులు తనఖీలుచేపట్టారు. ఎస్పీ ఆదేశాల రెండురోజుల పాటు తనిఖీలు చేపట్టి మత్స్యకారులను అప్రమత్తం చేస్తామని ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు.

●**వజ్రపుకొత్తూరు:** తీరప్రాంత గ్రామాల్లో అపరిచితులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలవని ఎస్ఐ సీహెచ్ రామారావు కోరారు. గురువారం మండలంలోని అక్కుపల్లి ఎన్‌టీఆర్ కూడలిలో పోలీసు ఏర్పాటు చేసి వాహనాలను తనిఖీ చేశారు. బెండిగేటు, పూండి. దేవునల్తాడ తదితర కూడలిలో పోలీసులతో కలిపి నిఘా ఉంచామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ జున్నారావు పాల్గొన్నారు.

200 పనిదినాలు కల్పించేందుకు కృషి

హిరమండలం:వంశధారనిర్వాసిత గ్రామాల్లో ఉపాధి వేతనవేతనదారులకు 200 రోజులు పని కల్పించేందుకు కృషి చేస్తానని జడ్పీటీసీ పి.బుచ్చిబాబు తెలిపారు.గురువారం సుభలయ ఆర్‌ఆర్‌కాలనీలోవేతనదారులతో కలిసి పాఠశాల ఆవరణలో పిచ్చిమొక్కలు తొలగించారు.

600 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

హరిపురం: మందస మండలంలోని బాతుపురంలో గురువారం ఎస్‌ఈబీ సిబ్బంది సారా స్థావరాలపైపోలీసులు దాడులు నిర్వహించారు. సీఐ జైభీం ఆధ్వర్యంలో నిర్వహించిన దాడుల్లో 600 లీటర్లు బెల్లంఊట, 25 లీటర్లు సారా స్వాధీనం చేసుకొని ధ్వంసం చేశారు. దాడుల్లో టాస్క్‌ఫోర్స్ సీఐ రామచంద్ర, సిబ్బంది కాంతారావు, భీమారావు, నాయుడు పాల్గొన్నారు.

నాణ్యమైన పశుగ్రాసంతో అధిక పాల ఉత్పత్తి

కోటబొమ్మాళి:నాణ్యమైన ప్రశుగ్రాసంతో అధిక పాల ఉత్పత్తి సాధించవచ్చని పశుసంవర్ధశాఖ సహాయక సంచాలకుడు ఎం.లోకనాథం తెలిపారు.గురువారం ఊడికలపాడు, లక్ష్మీపురంలో పశుగ్రాసవారోత్సవాల్లో భాగంగా పశువైద్యాధికారి మెండప్రజ్ఞచైతన్య ఆధ్వర్యంలో పాడి రైతులకు అవగాహన కల్పించారు.

● **సంతబొమ్మాళి:**లక్ష్మీపురంలోపశుగ్రాసాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో టెక్కలి పశుసంవర్ధకశాఖ ఏడీ రఘునాథ్, అప్పలసూరి,సిబ్బంది రమణ, వీరస్వామి పాల్గొన్నారు.

●**జలుమూరు:**స్థానిక పశువైద్య కేంద్రంలో రైతులకు పశుగ్రాసం విత్తనాలు సబ్సిడీపై అందజేశారు. కార్యక్రమంలో పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకుడు ఎం.లోకనాథం, జలుమూరు, అచ్యుతాపురం పశువైద్యాధికారులు ముద్దాడ దీప్తి, సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

బోరుభద్రలో ఆధ్యాత్మిక ర్యాలీ

సంతబొమ్మాళి: మండలంలోని బోరుభద్రలో ఆచల పరిపూర్ణనంద సద్గురు స్వామీ భక్తులు గురువారం ఆధ్యాత్మిక ర్యాలీ నిర్వహించారు. ఇచ్ఛాపురం నుంచి అయోధ్య వరకు పాదయాత్రలో భాగంగా సద్గురు పీఠాధిపతి ముద్దపు రమణమూర్తి ఆధ్వర్యంలో ర్యాలీ చేశారు.







ఆగి ఉన్న లారీని ఢీకొన్న బైక్.. యువకుడి మృతి


భార్గవ్ (ఫైల్)

బూర్జ: రోడ్డుపై ఆగి ఉన్న లారీని బైక్‌పై వచ్చి ఢీకొనడంతో ఓ యువకుడు మృతి చెందిన ఘటన గురువారం మండలంలో చోటుచేసుకుంది. అయ్యవారిపేట గ్రామానికి చెందిన చోడవరపు లక్ష్మంనాయుడు, సూర్యంల ఒక్కగానొక్క కుమారుడు భార్గవ్‌కుమార్ (23). ఇతడు పైడి భీమవరంలోని ఓ ప్రైవేట్ కంపెనీలో అప్రెంటీస్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. విధులకు ప్రతి రోజూ బైక్‌పై శ్రీకాకుళం వెళ్లేవాడు. గురువారం కూడా ఉదయం ఐదు గంటలకు ఇంటి నుంచి బైక్‌పై బయలుదేరాడు. ఇదే మండలం సింగన్నపాలెం గ్రామం వద్ద మరమ్మతులకు గురైన భారీ లారీ రోడ్డుపక్కన ఆగి ఉంది. దీనిని గమనించని భార్గవ్ బలంగా ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. భార్గవ్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా అందివచ్చిన ఒక్కగానొక్క కొడుకు అకాల మరణంతో ఆ తల్లిదండ్రుల రోదన వర్ణనాతీతం.

మృతుని కుటుంబానికి న్యాయం చేయాలి

సోంపేట: ఇస్కలపాలెం గ్రామానికి చెందిన కోడ విమల అనారోగ్యంతో ఈనెల 6వ తేదీన అండమాన్‌లో మృతిచెందింది. ఈమె మృతికి అక్కడి ఆసుపత్రి సిబ్బంది నిర్లక్ష్యమే కారణమంటూ కుటుంబ సభ్యులు, తోటి మత్స్యకారులు ఆరోపిస్తూ ఆరు రోజులుగా టెంట్ వేసుకుని నిరసన తెలుపుతున్నారు. ఈ క్రమంలో బుధవారం రాత్రి అక్కడి పోలీసులు వీరిని చెదరగొట్టి ఆ టెంట్‌ను తొలగించారు. ఈ విషయాన్ని కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడి దృష్టికి తీసుకెళ్లగా.. అక్కడి బీజేపీ ఎంపీతో మాట్లాడినట్టు స్థానిక మత్స్యకారులు తెలిపారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చూడాలని వారు కోరుతున్నారు.

తండేంవలసలో ఆక్రమణలు తొలగించండి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న గ్రామస్థులు

శ్రీకాకుళం అర్బన్: తండేంవలస గ్రామంలో పెద్ద చెరువును కొంత మంది వైసీసీ నాయకులు ఆక్రమించుకున్నారని, వాటిని తొలగించాలని ఆ గ్రామస్థులు కోరుతున్నారు. ఈ మేరకు గురువారం తహసీల్దార్ బీవీ రాణికి వినతి పత్రం అందజేశారు. సర్వే నెంబరు 94లో ఉన్న పెద్ద చెరువును ఆక్రమించుకుని ఆక్రమ నిర్మాణాలు చేపట్టారని వివరించారు. దీనిపై గతేడాది మే నెల 22న స్పందనలో ఫిర్యాదు చేశామని, అయినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన తహసీల్దార్... పరిశీలనకు ఎంపీడీవోకు రిఫర్ చేస్తున్నట్టు తెలిపారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం

ఆమదాలవలస: సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సీఎఫ్ఎల్ కో-ఆర్డినేటర్ చిగురుపల్లి వెంకటేష్ (చిన్ను) సూచించారు. గురువారం పట్టణంలోని మెట్టక్కివలసలో యూనియన్ బ్యాంకు సౌజన్యంతో ఎస్‌సీటీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు పొదుపు ప్రాముఖ్యతను తెలుసుకొని పొదుపు చేయాలన్నారు. ఏటీఎం పిన్, బ్యాంకు అకౌంట్ వివరాలు ఎవరికీ చెప్పొద్దని సూచించారు. బ్యాంకు అధికారులు ఎవరూ ఫోన్ చేసి వివరాలు అడగరని గుర్తు చేసుకోవాలన్నారు. వివిధ పథకాలపై వివరించారు. ఎవరైనా సైబర్ మోసాలకు గురైనప్పుడు 1930 టోల్ ఫ్రీ నెంబర్‌కు, ఇంటిగ్రేటెడ్ అంబుడ్స్‌మన్ టోల్ ఫ్రీ నెంబర్ 14448కు ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ పీవో మెట్ట అమ్మినాయుడు, ఆర్పీ శోభారాణి, జయలక్ష్మి, సీఎఫ్ఎల్ కో-ఆర్డినేటర్ రామారావు పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యల పరిష్కారమే లక్ష్యం


జిల్లా మహాసభలో తీర్మానం చేస్తున్న అసోసియేషన్ నాయకులు

శ్రీకాకుళం క్రైం: జిల్లాలో గత కొన్నేళ్లుగా పెన్షనర్లు అనేక సమస్యలతో సతమతమవుతున్నారని, వాటి పరిష్కారమే లక్ష్యంగా పోరాటం చేద్దామని ఆల్ ఇండియా బీఎస్ఎన్ఎల్-డీవోటీ పెన్షనర్స్ అసోసియేషన్ (ఏఐబీడీపీఏ) రాష్ట్ర కార్యదర్శి కేఎస్‌సీ బోస్ అన్నారు. స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో గురువారం అసోసియేషన్ జిల్లా మహాసభలు నిర్వహించారు. తొలుత పతాకాన్ని ఆవిష్కరించి జిల్లా కార్యదర్శి ప్రవేశపెట్టిన కార్య నివేదికపై చర్చించి ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సందర్భంగా బోస్ మాట్లాడుతూ.. పెన్షనర్లకు చెల్లించే నెలవారీ ఫిక్స్ మెడికల్ అలవెన్స్ వెయ్యి నుంచి రూ.3వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. సంచార భవన్ వద్ద పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం పెన్షనర్స్ అదాలత్ సెల్ ఏర్పాటు చేయాలని, మెరుగైన ఆస్పత్రిలో చికిత్స పొందేలా బీఎస్ఎన్ఎల్ ఎంపేనల్ హాస్పటల్‌ను గుర్తించేలా జనరల్ మేనేజర్ చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఏఐబీడీపీఏ రాష్ట్ర సహాయ కార్యదర్శి రామారావు అసోషియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అవధానం అతి ప్రాచీనమైన సాహిత్య ప్రక్రియ


అవధానంలో పాల్గొన్న రామానంద సరస్వతి

శ్రీకాకుళం కల్చరల్: అవధానం అనేది అతి ప్రాచీనమైన సాహిత్య ప్రక్రియ అని రామానంద సరస్వతి అన్నారు. సుమిత్రా కళా సమితి ఆధ్వర్యంలో వైజయంతి కళావేదికలో రెండో రోజు గురువారం జరిగింది. ఈ కార్యక్రమంలో రామానంద సరస్వతి, పార్వతీపురానికి చెందిన సూర్యపీఠం అధ్యక్షుడు వేమకోటి నరహరి శాస్త్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా శాస్త్రి మాట్లాడుతూ.. అవధాన ప్రక్రియ అనేది మేధస్సుతో కూడుకొని ఉంటుందని అది దేవుడిచ్చిన వరమన్నారు. అపర్ణచే ద్విశతావధానం నిర్వహించడం చాలా బాగుందన్నారు. ఇప్పిలి శంకర్ శర్మ, పులఖండం శ్రీనివాసరావు, కొమ్మనా సురేష్, మండవల్లి రవి, గుత్తు చిన్నారావు, వీవీఆర్ మూర్తి, నక్క శంకరరావు తదితరులు పాల్గొన్నారు. అలాగే ఆరోగ్యప్రదాత అరసవల్లి సూర్యనారాయణ స్వామివారిని మౌనానంద తపోవనం సౌభాగ్య భువనేశ్వరి పీఠాధిపతి రామానంద భారతి స్వామీజీ దర్శించుకున్నారు. స్వామివారి ప్రసాదాన్ని ఆలయ ఈవో అందజేశారు.

మోటారు వాహనాల చట్టంపై అవగాహన ఉండాలి


మాట్లాడుతున్న న్యాయాధికారి గంగాధర్

గుజరాతీపేట: మోటారు వాహనాల చట్టాలపై విద్యార్థులకు అవగాహన అవసరమని సీనియర్ సివిల్ న్యాయాధికారి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఇన్‌చార్జి కార్యదర్శి సీహెచ్ గంగాధర్ అన్నారు. స్థానిక ఓ ప్రైవేట్ డిగ్రీ కళాశాలలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. వాహనాలు నడిపేటప్పుడు జాగ్రత్తగా నడపాలన్నారు. కార్యక్రమంలో స్పెషల్ మొబైల్ కోర్టు జేఎంఎఫ్‌సీ సీహెచ్ శ్రీవిద్య, జూనియర్ సివిల్ న్యాయాధికారి మానీమ్ రోషిని, అడ్వేకేట్ ఇందిరా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఫ్లోరోసిస్‌పై అప్రమత్తం

లావేరు: ఫ్లోరోసిస్ వ్యాధిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా అధికారి అరుణకుమారి అన్నారు. దీనిపై గురువారం బుడుమూరు, బొంతుపేట గ్రామాల్లో వైద్య సిబ్బందికి అవగాహన కల్పించారు. అనంతరం స్థానిక ప్రాథమిక పాఠశాలల విద్యార్థులను పరీక్షించారు. కార్యక్రమంలో మురపాక హెల్త్ అసిస్టెంట్ శ్యామసుందరావు, ఎంఎల్‌హెచ్‌సీ భారతి, వరహాలు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో హీరా పంచమి

● వివిధ రూపాల్లో జగన్నాథుడి దర్శనం


టెక్కలి: నరసింహ స్వామి అవతారంలో..

శ్రీకాకుళం కల్చరల్: ఇలిసిపురంలో ఉన్న జగన్నాథస్వామి ఆలయంలో గురువారం హీరా పంచమి పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని జగన్మోహిని అవతారంలో అలంకరించారు. మొండేటి వీధిలోని లలిత సహిత శివకామేశ్వర స్వామి ఆలయం, షిరీ మందిరం ఆవరణలో గిడుతూరు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో లక్ష్మీదేవి విగ్రహాన్ని ఊరేగించారు. గుజరాతిపేట, ఇలిసిపురంల్లో గల స్వామివారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేపట్టారు. అలాగే జిల్లా వ్యాప్తంగా ఉన్న జగన్నాథ స్వామి ఆలయాల్లో స్వామివారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు.


శ్రీకాకుళం కల్చరల్: గుజరాతీపేటలో జగన్మోహిని అవతారంలో స్వామివారు


నరసన్నపేట: నరసింహునిగా..


హిరమండలం: వామన అవతారంలో..


ఎల్ఎన్ పేట: వామనావతారంలో..


సోంపేట: నరసింహ స్వామిగా..


ఇచ్ఛాపురం: ఉగ్రనరసింహావతారంలో జగన్నాథుడు

నిధుల దుర్వినియోగంపై ఎమ్మెల్యే ఆగ్రహం

● బిక్కమొహం వేసిన మున్సిపల్ అధికారులు

● సమీక్షలో కూన రవికుమార్ అసహనం


అధికారులను ప్రశ్నిస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

ఆమదాలవలస: వైసీపీ ఐదేళ్ల పాలనలో మున్సిపాలిటీలో జరిగిన ప్రభుత్వ నిధుల దుర్వినియోగంపై స్థానిక ఎమ్మెల్యే కూన రవికుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో ఆయన సమీక్షించారు. ముఖ్యంగా ఇంజనీరింగ్ అధికారులు ఐదేళ్లలో చేపట్టిన చెల్లింపులపై ఆరా తీశారు. ప్రస్తుతం మున్సిపల్ ఖాతాలో ఉన్న జనరల్ నిధుల ఎంత ఉన్నాయని ఎమ్మెల్యే ప్రశ్నించగా.. రూ.19.5 లక్షలు మాత్రమే ఉన్నట్టు అకౌంటెంట్ సాయిరామ్ చెప్పగా పూర్తి వివరాలు తెలపాలని అసహనం వ్యక్తం చేశారు. 2023-2024 సంవత్సరంలో రూ.3.67 కోట్లు రాబడి వస్తే.. రూ.ఐదు కోట్లు ఎలా ఖర్చు చేశారని, మిగిలిన రూ.1.33 కోట్లు లోటు మాటేంటని నిలదీశారు. మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం ఇంటి వద్ద 12 మంది సిబ్బందిని కేటాయించి వారి వ్యక్తిగత పెట్రోల్ బంకు, కాలేజ్ కారు డ్రైవర్లుగా విధులు నిర్వహిస్తే.. వారికి మున్సిపల్ ప్రభుత్వం నిధుల నుంచి జీతాలుగా రూ.1.20 కోట్లు ఎలా చెల్లిస్తారని ప్రశ్నించడంతో బిక్కమొహం వేసి నిల్చొండిపోయారు. ఇలా వివిధ అంశాలపై ఆరా తీయడంతో సంబంధిత అధికారులు నీళ్లునమిలారు. మున్సిపల కమిషనర్ జి.రవి, డీఈ సుగుణాకర్, ఏఈ అప్పలనాయుడు, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తమ్మినేని గీతా, టీడీపీ నాయకులు చంద్రశేఖర్, మురళీధరరావు, అప్పలనాయుడు, భాస్కరరావు పాల్గొన్నారు. ● స్థానిక రైతు బజారు వద్ద ఎమ్మెల్యే రవికుమార్ కంది పప్పు కౌంటర్‌ను ప్రారంభించారు. మార్కెట్ ధర కంటే తక్కువకే ప్రభుత్వం కందిపప్పును అందిస్తుందన్నారు. ● స్థానిక మున్సిపల్ కార్యాలయంలో పెన్షనర్ల సంఘ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సురవరపు శిమ్మినాయుడు, బొడ్డేపల్లి జనార్దనరావు ఆధ్వర్యంలో సంఘ నాయకులంతా ఎమ్మెల్యే కూన రవికుమార్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సంఘ గౌరవాధ్యక్షుడు బొడ్డేపల్లి మోహన్‌రావు, కోశాధికారి హెచ్‌వీ సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు ధాస్యం లక్ష్మణరావు, కె.షన్ముఖరావు, ఎన్.చంద్రశేఖరరావు, బీవీ రమణ, భానోజీరావు, కె.సంజీవరావు పాల్గొన్నారు.

జనాభా నియంత్రణతోనే దేశాభివృద్ధి


ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో మీనాక్షి

అరసవల్లి: బిడ్డకు బిడ్డకు మధ్య అంతరం తల్లి, బిడ్డకు శ్రేయస్సు అని డీఎంహెచ్‌వో బొడ్డేపల్లి మీనాక్షి అన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయం వద్ద ఆమె జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. ఈ ర్యాలీ ఏడురోడ్ల జంక్షన్ వరకు సాగింది. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాటాడుతూ.. ప్రపంచంలో భారత్ అగ్రగామిగా ఎదుగుతోందని, భవిష్యత్తులో సూపర్ పవర్‌గా ఎదగడానికి జనాభా నియంత్రణ ఎంతో అవసరమన్నారు. ఈ మేరకు ఏడురోడ్ల జంక్షన్ వద్ద జనాభా నియంత్రణకు అందరితో ప్రమాణం చేయించారు. అనంతరం వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో వైద్యులు, సిబ్బందితో ఆమె సమావేశాన్ని నిర్వహించారు. అలాగే వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, అవార్డులు అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీదేవి, డీపీఎంవో జీవీ లక్ష్మి, డాక్టర్ సుజాత, సంఘ సేవకులు మంత్రి వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి


అచ్చెన్నాయుడుని అభినందిస్తున్న ఎన్జీవో సంఘ నాయకులు

అరసవల్లి: పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర ఎన్జీవో సంఘ రథసారథి కె.శివారెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చౌదరి పురుషోత్తమనాయుడు, ఎన్జీఆర్ జిల్లా అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్ కోరారు. వ్యవసాయ శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన కింజరాపు అచ్చెన్నాయుడుని గురువారం అమరావతిలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఉద్యోగులకు 15వ తేదీ వరకు జీతాలు అందేవి కాదని, కానీ నేడు 1వ తేదీ నాడే జీతాలు అందించడం అభినందనీయమన్నారు. ఉద్యోగులకు పీఆర్సీ అమలు చేయాలని పెండింగ్‌లో ఉన్న డీఏలు, ఆర్థిక ప్రయోజనాలను త్వరితగతిన మంజూరు చేసి ఉద్యోగులను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు రంజిత్ నాయుడు, శివప్రసాద్, నిర్మలాకుమారి, శాంతి తదితరులు ఉన్నారు.

'ఉపాధి'ని కొబ్బరి రైతులకు అనుసంధానం చేయండి

కవిటి: ఉపాధి హామీ పథకాన్ని కొబ్బరి రైతులకు అనుసంధానం చేసి ఉద్దానం ప్రాంత రైతులను ఆదుకోవాలని కూటమి నేతలు కోరారు. మండల కేంద్రంలో గత ఏడాది జరిగిన ఉపాధిహామీ పథకంపై గురువారం సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. డ్వామా పీడీ చిట్టిరాజు మాట్లాడుతూ.. ప్రభుత్వం దృష్టికి ఈ విషయాన్ని తీసుకువెళ్తానని తెలిపారు. ఉపాధి హామీ పథకం ద్వారా ప్రతీ ఒక్కరికీ పని కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. మస్టర్లు, హాజరు పట్టీల్లో దిద్దుబాట్లు చేయొద్దన్నారు. గత ఏడాదికి గాను వేతనాల కింద రూ.10,38,10,600, మెటీరియల్ కింద రూ.3,53,6,037 వెచ్చించామన్నారు. సమావేశంలో డీవీవో బి.లవరాజు, ఏపీడీ శ్రీనివాసరెడ్డి, మురళి, ఎమ్మెల్సీ ఎస్.రామారావు తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం చోరీ

ఎచ్చెర్ల: కుశాలపురం బైపాస్ వద్ద ద్విచక్ర వాహనం చోరీకి గురైనట్టు కల్యాణ్‌దాస్ గురువారం స్థానిక పోలీసు స్టేషన్‌కు ఫిర్యాదు చేశాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కల్యాణ్‌దాసుతో పాటు మరికొంతమంది ఇతర ప్రాంతాల నుంచి ఇక్కడికి వచ్చి గ్రామాల్లో తిరుగు తూ బట్టల వ్యాపారం చేసుకుంటున్నారు. ఈ నెల 8వ తేదీ రాత్రి తాను ఉంటున్న ఇంటి బయట బైక్ పార్కు చేశారు. ఉదయం చూసేసరికి తన బైక్ కనిపించకపోవం తో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎచ్చెర్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పీఈటీలను విద్యాశాఖలో విలీనం చేయాలి


ఎమ్మెల్యే అశోక్‌కు వినతిపత్రం ఇస్తున్న కాంట్రాక్టు పీఈటీలు

కవిటి: సర్వశిక్షా అభియాన్ పరిధిలో కాంట్రాక్టు విధానంలో పనిచేస్తున్న పీఈటీలను విద్యాశాఖలో విలీనం చేసి రెగ్యులర్ ఉద్యోగులుగా గుర్తించేలా చూడాలని కోరుతూ ఎమ్మెల్యే బి.అశోక్‌ను ఆ సంఘ నాయకులు కోరారు. ఈ మేరకు గురువారం రామయ్యపుట్టుగలో ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రాన్ని అందించారు. రాష్ట్ర వ్యాప్తంగా 550 మంది పీఈటీలు ఉన్నా డీఎస్సీలో వాటిని చూపించటం లేదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. ఈ విషయాన్ని విద్యాశాఖామంత్రి ఎన్.లోకేష్‌తో మాట్లాడి న్యాయం జరిగేలా ప్రయత్నిస్తానని వారికి ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. పలువురు పీఈటీలు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల ఆశయ సాధనకు కృషి చేయాలి


వసతిగృహాన్ని పరిశీలిస్తున్న డీఈవో

రణస్థలం: తల్లిదండ్రులు ఎన్నో ఆశలతో చదివిస్తున్నారని, వారి ఆశయ సాధనకు కృషి చేయాలని డీఈవో వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం కొండములగాం ఏపీ మోడల్ స్కూల్‌ను ఆయన సందర్శించారు. బాలికల వసతి గృహాన్ని పరిశీలించారు. విద్యార్థులకు ప్రతిరోజూ ఇస్తున్న మెనూ వివరాలు అడిగి తెలుసుకున్నారు. పౌష్టిక విలువలతో కూడిన ఆహారం ఇవ్వాలని సిబ్బందికి సూచించారు. ఈ ఏడాది పదో తరగతిలో ఉత్తీర్ణ సాధించిన విద్యార్థుల వివరాలను ప్రిన్స్‌పాల్ పి.శ్రీధర్ వివరించారు. కార్యక్రమంలో ఎంఈవో త్రినాథరావు పాల్గొన్నారు.

సమయపాలన పాటించాలి..

ఇచ్ఛాపురం: అంగన్‌వాడీ కార్యకర్తలు సమయపాలన పాటించాలని, లేదంటే చర్యలు తప్పవని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారిణి నాగరత్నం హెచ్చరించారు. గురువారం ప్రాజెక్ట్ పరధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అంగన్‌వాడీ సెంటర్‌లో ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు తప్పకుండా ఉండాలన్నారు. కేంద్ర నిర్వహణలో ప్రీస్కూల్ ప్రాముఖ్యత, పౌష్టికాహారం పంపిణీ, పెరుగుదల పర్యవేక్షణ, ఆన్‌లైన్ నివేదికల పరిశీలన తదితర అంశాలపై వివరించారు. మిషన్ శక్తి కోసం 100రోజులు ప్రత్యేక అవగహన, నమోదు గూర్చి వివరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు , ఏసీడీపీఓ మరియు సీడీపీఓ పాల్గొన్నారు.

యాదవులను బీసీ-బీలోకి మార్చాలి

ఇచ్ఛాపురం: ఉత్తరాంధ్ర జిల్లాలోని యాదవ కులస్థులను బీసీ-బీ జాబితాలో చేర్పించాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనువాస్ యాదవ్‌ను శ్రీకాకుళం జిల్లా యాదవకుల నేతలు కోరారు. ఈ మేరకు విశాఖలో ఆయన్ని కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. వెనుకబడిన కులానికి చెందిన యాదవులు బీసీ-డీ ఉన్నారని, వారిని బీసీ-బీలోకి మార్చాలని కోరారు. అలాగే నదుల అనుసంధానానికి కృషి చేయాలన్నారు. జిల్లాలోని వంశధార, నాగావళి, మహేంద్రతనయ, బాహుదా నదులను అనుసంధానం చేసి జిల్లా శస్యశ్యామలం అవడానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఇచ్ఛాపురం టీడీపీ పట్టణ అధ్యక్షుడు కాళ్ల ధర్మారావు, ఎన్.పురుషోత్తం, జన్నెల సంతోష్, బి.లోహిదాస్, జగదీష్, మాధవరావు, మురపాక కాళీప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

డెంగ్యూ, మలేరియాపై అవగాహన

ఆమదాలవలస: సీజనల్ వ్యాధులను అరికట్టడానికి స్టాఫ్ డయేరియా, డెంగ్యూ, మలేరియా కార్యక్రమం ద్వారా అవగాహన కల్పిస్తున్నట్టు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అసిస్టెంట్ మేనేజర్ పైడి కూర్మారావు వివరించారు. గురువారం స్థానిక బొబ్బిలిపేట పంచాయతీ కార్యాలయం, పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం తదితర చోట్ల చేపట్టిన పారిశుధ్య కార్యక్రమాలను ఆయన పరిశీలించారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

సోంపేట: ఉద్దానం ఫీడర్‌లో మరమ్మతుల నేపథ్యంలో శుక్రవారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏఈ జి.ప్రసాద్ తెలిపారు. ఉద్దానం పరిధిలోని బారువ, గొల్లగండి, సీహెచ్ గొల్లగండి, రామయ్యపట్నం తదితర గ్రామాల ప్రజలు సహకరించాలని కోరారు.

కొత్తపేట ఫీడర్ పరిధిలో..

ఎచ్చెర్ల: కొత్తపేట ఫీడర్ మరమ్మతుల కారణంగా పలు గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈఈ ఎస్.బయ్యన్నాయుడు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. కొత్తపేట, కొయ్యాం, దోమాం మెట్టపేట, అకిన్‌ఖాన్‌పేట, వెంకన్నగారిపేట, తెప్పరేవు సనపలవానిపేట, తమ్మినాయుడుపేట, పూడివలస, జరిపినాయుడుపేట, ఇబ్రహీంబాద్ గ్రామాలకు ఉదయం 8 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఇచ్ఛాపురం రూరల్ పరిధిలో..

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం రూరల్ సబ్‌స్టేషన్ పరిధిలో 33కేవీ విద్యుత్ పనులు నిమిత్తం పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ గోవిందరావు ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు ఈదుపురం, డొంకూరు, కేశుపురం, సన్యాసిపుట్టుగ, కొళిగాం, బిర్లంగి, తేలుకుంచి, హరిపురం, బొడ్డకాళి, బొడ్డబడ గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు తెలిపారు.

పాత్రునివలసలో మెడికల్ క్యాంప్

శ్రీకాకుళం రూరల్: పాత్రునివలసలోని ప్రాథమిక పాఠశాలలో ప్రభుత్వ వైద్య కళాశాలలోని వైద్య విభాగం ఆధ్వర్యంలో గురువారం ఫ్యామిలీ అడాప్షన్ కార్యక్రమంలో భాగంగా మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతీ వైద్య విద్యార్థి ఐదు కుటుంబాలను దత్తత తీసుకుని వారికి మెడికల్ క్యాంపులో వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పి.అప్పలనాయుడు, డాక్టర్ పి.మనోజ్, అసిస్టెంట్ ప్రొఫెసర్ కేజీఆర్ ఆచార్యులు, ఎంపీహెచ్ ఈవో జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

మెటీరియల్ పంపిణీ

అరసవల్లి: ఆర్టీసీ హెవీ డ్రైవింగ్ స్కూల్ శ్రీకాకుళంలో 16వ బ్యాచ్‌లో శిక్షణ పొందుతున్న డ్రైవర్లకు 1,2 డిపోల మేనేజర్లు గురువారం మెటీరియల్స్ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరు శిక్షణను వినియోగించుకుని ఉత్తమ డ్రైవర్లుగా తయారవ్వాలని ఆకాంక్షించారు. మంచి నైపుణ్యం కలిగిన శిక్షకుల ఆధ్వర్యంలో తర్ఫీదు ఇస్తున్నట్టు తెలిపారు. శిక్షణలో రోడ్డు, ట్రాఫిక్, మోటారు వెహికల్ రూల్స్‌పై బోధించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డిపో మేనేజర్లు మల్లికార్జునరావు, ఆర్ఎస్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

స్వయం శక్తితో ఎదగాలి

గుజరాతీపేట: విద్యార్థులు స్వయంశక్తితో ఎదగాలని జిల్లా పరిశ్రమల కేంద్రం మేనేజర్ జె.ఉమామహేశ్వరరావు తెలిపారు. స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఆవరణలో గురువారం నూతన పారిశ్రామిక ఔత్సాహిక వేత్తల సదస్సు నిర్వహించారు. లీడ్ బ్యాంకు మేనేజర్ సూర్యకిరణ్, ప్రిన్సిపాల్ కె.సూర్యచంద్రరావు, నాబార్డ్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ రవి, ఇతర అధికారు లు పీవీ రఘునాథరావు, రవికుమార్, రమేష్ కృష్ణ, కన్వీనర్ కృష్ణారావు, పి.శంకర్‌నారాయణ, ఎస్.పద్మావతి, సీహెచ్ కృష్ణారావు, టి.ఆదిలక్ష్మి, కె.లలితా బాయ్ పాల్గొన్నారు.

సిలబస్ మార్పులతో నష్టం

గుజరాతీపేట: పదో తరగతి విద్యార్థులకు మారిన టెస్ట్ బుక్‌లో ఉన్న కంటెంట్, పాఠాలు భవిష్యత్‌లో విద్యార్థులకు ఏ మాత్రం ఉపయోగ పడేలా లేవని, దీనివల్ల విద్యార్థులు నష్టపోతారని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు అన్నారు. జిల్లాలోని పాఠశాలలో ఎన్‌రోల్‌మెంట్ ప్రక్రియ ఏవిధంగా ఉందో తెలుసుకునేందుకు మండలాల్లో గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ విద్యాసంవత్సరం మారిన పదో తరగతి సోషల్ టెస్ట్‌బుక్‌లో 258 పేజీలు ఉంటే 167 పేజీల యూరోపియన్ చరిత్రకు కేటాయించి, రాష్ట్ర చరిత్రకు ప్రాధాన్యత తగ్గించారన్నారు. తొమ్మిదో తరగతి హిందీ పుస్తకం చాలా ఇబ్బంది కరంగా ఉందన్నారు. భౌతికశాస్త్రంగా మూలకాల వర్గీకరణ, పరమాణు నిర్మాణం, రసాయన బంధం లాంటి పాఠాలు తొలగించేయడం దారుణమన్నారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిషోర్‌కుమార్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎల్.బాబురావు, బి.శ్రీరామ్మూర్తి కె.దాలయ్య, వాసుదేవరావులు ఉన్నారు.

ఉద్యోగుల కోసం పోరాడేది ఎంప్లాయిస్ యూనియన్

అరసవల్లి: ఉద్యోగుల సమస్యలపై అనునిత్యం పోరాడేది ఒక్క ఎంప్లాయిస్ యూనియన్ మాత్రమేనని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.నానాజీరావు, జిల్లా సీనియర్ నాయకులు అప్పారావు, ఎస్ఎస్ఆర్ వర్మ, కొర్లాం గణేశ్వరరావు అన్నారు. యూనియన్ 72 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా యూనియన్ కార్యాలయం, శ్రీకాకుళం వద్ద వారు గురువారం జెండాను ఎగురవేసి మాట్లాడారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జి.త్రినాథ్, కె.దశరథ, జిల్లా అమరావతి జేఏసీ కార్యదర్శి ఎస్వీ రమణ, 12 డిపో నాయకులు బిఆర్ కృష్ణ, కె.బాబూరావు, కెజి రావు, డిపో ఉద్యోగులు, ఔట్ సోర్సింగ్ కార్మికులు పాల్గొన్నారు.

మాజీ సైనికులకు అండగా ఉంటా

పొందూరు: దేశానికి సేవలందించిన మాజీ సైనికులకు టీడీపీ ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. రవికుమార్‌ను శ్రీకాకుళంలో మండలానికి చెందిన మాజీ సైనికులు కలిసి సన్మానించారు. కార్యక్రమంలో హరిబాబు, లక్ష్మణరావు, రామారావు, తదితరులు ఉన్నారు.

పరిశుభ్రతపై దృష్టి సారించాలి

పొందూరు: గ్రామాల్లో పరిశుభ్రత మెరుగుపడేలా గ్రామ ప్రత్యేకాధికారులు, సచివాలయ సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని మండల ప్రత్యేకాధికారి, జిల్లా హౌసింగ్ పీడీ బి.నగేష్ ఆదేశించారు. మండల కేంద్రంలో మండల పరిషత్ సమావేశ మందిరంలో గురువారం సచివాలయ కార్యదర్శులు, గ్రామ ప్రత్యేకాధికారులతో సమావేశం నిర్వహించారు. శుక్రవారం డ్రైడేను ఉదయం 7 నుంచి 9 గంటల వరకు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఏవో సింహాచలం, గ్రామప్రత్యేకాధికారులు రామరాజు. రాజారావు, బి.బాబ్జీ, శ్రీనివాసరావు ఉన్నారు.

తల్లిదండ్రులను గౌరవించాలి

శ్రీకాకుళం కల్చరల్: ప్రతి ఒక్కరూ తల్లిదండ్రులను గౌరవించాలని లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ అధ్యక్షుడు డాక్టర్ బొడ్డేపల్లి సురేష్ అన్నారు. స్థానిక పీఎస్ఎన్ఎం పాఠశాలలో గురువారం ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రెండో పట్టణ సీఐ జి.ఉమామహే శ్వరరావు మాట్లాడుతూ.. గురువును మించిన దైవం లేదని తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి సింధూర, ట్రెజరర్ జోగి భారతి, జోనల్ చైర్మన్ పొన్నా రవి కుమార్, బి.దేవభూషణ్, మెంటార్ నటుకుల మోహన్, హెచ్‌ఎం భాస్కర్, టి.రాంగోపాల్, ఎస్.మణి, జి.చిన్నారావు, ఉర్లాం శివ తేజ తదితరులు పాల్గొన్నారు.